నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 25 జులై 2024 | www.navatelangana.com

ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-రామచంద్రాపురం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను బుధవారం రామ చంద్రాపురం పట్టణంలో ఘనంగా జరిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ పటాన్చెరు నియోజకవర్గ నాయకులతో కలిసి ఆదర్శరెడ్డి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య, తెలంగాణ ఉద్యమ నేత వెంకటేష్ గౌడ్, జిల్లా మాజీ గ్రంథాలయ డైరెక్టర్ కుమార్ గౌడ్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, నరసింహ, సత్యనారాయణ, కృత్బుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోం

నవతెలంగాణ-అమీన్‌పూర్



అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడితే ఎవరినైనా వదిలిపెట్టబోమని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి హెచ్చరించారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని శంభుని కుంటలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి పవన్, రెవెన్యూ అధికారులు కలిసి బుధవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి.. ఎవరైనా నిర్మాణాలు చేపట్టాలంటే.. విధిగా అనుమతి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలో రిజిస్ట్రేషన్ ల్యాండ్ ఒక చోట ఉంటే.. భవన నిర్మాణాలు మరో చోట చేపడుతున్నారన్నారు. దీన్ని గుర్తించి అక్రమ కట్టడాలను నిలిపివేశామన్నారు. భవిష్యత్తులోనూ ఇబ్బందులు రాకుండా ఉండాలంటే అన్ని అనుమతులు కరెక్టుగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అక్రమ నిర్మాణాలను ఏ దశలో ఉన్నా.. కూల్చివేస్తామని, అనవసరంగా డబ్బును వృథా చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైంగిగదాడి కేసులో నిందితునికి 20ఏండ్ల జైలు

రూ.20 వేల రూపాయల జరిమాన

నవతెలంగాణ-సంగారెడ్డి

ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి కోర్టు 20 ఏండ్ల జైలు శిక్షతోపాటుగా రూ.20 వేల జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో.. 16 ఏండ్లు ఉన్న ఓ మైనర్ బాలికను ఆమె తండ్రి రాందాస్, చిన్నమ్మ రాధ, వరుసకు వదిన అయిన సుమిత్రలు ఒత్తిడి చేసి కంది మండలం గొల్లగూడానికి చెందిన నున్సావత్ ప్రకాష్‌తో 2019లో బలవంతంగా ఎంగేజ్మెంట్ జరిపించారు. అనంతరం వారం రోజుల తర్వాత సుమిత్ర వాళ్ల ఇంట్లో ఆ మైనర్‌పై ప్రకాష్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దాంతో అతడితో పాటు వివాహం చేసుకోవాలని తనను ఇబ్బంది పెట్టిన రాందాస్, రాధ, సుమిత్రలపై బాధితురాలి సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపారు. దర్యాప్తు పూర్తి చేసి సంగారెడ్డి డీఎస్పీ శ్రీధర్ రెడ్డి నేరస్తులను కోర్టులో ప్రవేశపెట్టగా, కేసు పూర్వపరాలను విన్న గౌరవ స్పెషల్ పోక్సో మేజిస్ట్రేట్ జయంతి నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధించింది. కాగా నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన అధికారులు అప్పటి ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ ఎస్ఐ ఇన్వెస్టిగేషన్ అధికారులు డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ వినయ్ కుమార్, స్పెషల్ పీపీ కృష్ణ, భరోసా లీగల్ సపోర్ట్ పర్సన్ సౌజన్య, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ జైహింద్ లాల్, వెంకటేశ్వర్లు, కోర్ట్ లైజనింగ్ అధికారి కె. సత్యనారాయణ ఎస్ఐలను ఎస్పీ రూపేష్ అభినందించారు.

జోగిపేట మున్సిపాల్టీలో వన మహోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపల్‌లో బుధవారం వనమహోత్సవము 2024 లో భాగంగా 10,11,12,13 వ వార్డుల్లో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమములో చైర్మెన్ గూడెం మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వార్డు కౌన్సిలర్స్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్, కోరబోయిన నాగరాజు, రంగా సురేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్, మెప్మా సీఓ బిక్షపతి గౌడ్, మెప్మా ఆర్పీలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు లేకపోవడం నిరాశే

నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధుల కేటాయింపులు చేయక పోవడం సరికదాని.. విభజన చట్టంలో పేర్కొన్న హామీలతో పాటు తెలంగాణలో రైలు మార్గాలు, పెంపునకు, నీటి పారుదల ప్రాజెక్టులకు, పరిశ్రమల అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేయక పోవడంతో తెలంగాణ అభివృద్ధి ఎట్లా సాధ్యం అని ఫోరమ్ ఫర్ బెటర్ సం గారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ఎంపీలు పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రానికి నిధు లు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాకు మెదక్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన ఎంపీలు ఉమ్మడి జిల్లాకు రైలు మార్గాలు, పరిశ్రమిక అభివృద్ధికి, నవోదయ విద్యాలయాలు, ఇతర మౌలిక సదుపాయల అభివృద్ధికి కేంద్రంనుండి నిధుల మంజూరుకు కృషి చేయాలన్నారు.

గుండెపోటుతో డీలర్ మృతి

ఏడాది క్రితమే భార్య మరణం.. అనాథగా మారిన కూతురు

నవతెలంగాణ-పుల్కల్

మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పడకంటి మల్లేశం(48) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఏడాది క్రితమే ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దాంతో వారి ఒక్కగా నొక్క కూతురు బాగోగులు ఆమె మేనమామలు చూసుకుంటున్నారు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆయనకు మంగళవారం రాత్రి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. గ్రామంలో 20 ఏండ్లుగా గ్రామంలో విధులు నిర్వహి స్తున్న మల్లేశం.. హఠాన్మరణం చెందడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఆయన భౌతికకాయానికి మండల డీలర్లు పుష్పగుచ్చాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.మృతుని కూతురును ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్రం



నవతెలంగాణ-పుల్కల్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా కేంద్ర బీజేపీ సర్కార్ తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పుల్కల్ మండలా ధ్యక్షులు మాచర్ల విజయ కుమార్ తీవ్రంగా మండి పడ్డారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పట్ల బీజేపీ ప్రభుత్వం మొండి చేయి చూపించడం ఎంతవరకు సమంజ సమన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ పూర్తిగా విఫలం చెందింద న్నారు. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినప్పటికీ ఇటీవల కేవలం లక్ష రుణమాఫీ మాత్రమే చేశారన్నారు. అది కూడా కేవలం 40 శాతం మందికె వర్తించిందన్నారు. మిగతా రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నా రన్నారని.. వెంటనే వారికి కూడా రుణమాఫీ చేయాలన్నారు. అంతే కాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ పీఏసీఎస్ డైరెక్టర్ మహేష్ బాబు, బీఆర్ఎస్ పుల్కల్ గ్రామాధ్యక్షులు లోకేష్, బస్వాపూర్ గ్రామాధ్యక్షులు బర్మల రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

నవతెలంగాణ-జోగిపేట



కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపించిందని సంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడు తూ.. గత ఓటాన్ బడ్జెట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు, ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు కేవలం 0.1 మాత్రమే బడ్జెట్‌ను పెంచారన్నారు. విద్యారంగానికి బడ్జెట్ చాలా తగ్గిందన్నారు. విద్యా సంస్థలు కేంద్ర విశ్వవి ద్యాలయాలు అభివృద్ధి కోసం నిధులు ఇచ్చే యూజీసీకి భారీగా నిధులు కోతపెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ, పరిశోధన లకు ప్రత్యేక నిధులు కేటాయింపులు, ఈ బడ్జెట్ లో ప్రస్తావన తీసుకొని రాలేదన్నారు. దేశంలో పాఠశాల విద్యా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని అనేక నివేదికలు చెబుతు న్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ఈ దేశంలో 'సమూల మార్పులు తెచ్చే, భవిష్యత్ మార్చే విద్యావిధానం అని తీసుకుని వస్తున్న నూతన విద్యావిధానం -2020' ఈ బడ్జెట్ తో అమలు చేస్తారా అని ప్రశ్నించారు. బడ్జెట్‌ను సవరించి, విద్యా అభివృద్ధికి ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్య అభివృద్ధి కోసం చర్యలు తీసుకొని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు సన్మానం

నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఖమ్రోద్దీన్, గోపాల్, ప్రీతిలకు బుధవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయి కుమార్ హాజరై సన్మానించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేయాలన్నారు. అప్పుడే విద్యావ్యవస్థ బాగు పడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్, పాఠశాల హెచ్ఎం ప్రకాశం, వినయ్, టీచర్లు సంతోష, వీణ, పంచాయతీ కార్యదర్శి శివకుమారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

గ్రామ దేవతల కృపా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు విస్తారంగా పండాలని బొల్లారం యువజన కాంగ్రెస్ నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి ఆకాంక్షించారు. మున్సిపాల్టీ పరిధిలోని జ్యోతి నగర్‌లో ఆషాడమాసం సందర్భంగా బుధవారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాధవ్ రావు, శేఖర్, కృష్ణ రావు, రాము, సింహాచలం, సుధీర్, నాగేశ్వర్, జనార్దన్, సాయి, ఢిల్లీ, ప్రసాద్, చందు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షా..! జనం గోడు వినిపించేరా



- నియోజకవర్గాల్లో అనేక సమస్యలు
- సంగమేశ్వర, బసవేశ్వర, గౌరవెల్లి ప్రాజెక్టులకు నిధులు
- సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ
- ఉమ్మడి జిల్లాలో ట్రిబుల్ ఆర్ నిర్వాసితుల పరిహార సమస్య
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు
- ఇద్దరు మంత్రులు, ఇద్దరు మాజీ మంత్రులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర శాసన సభా సమావేశాలు వాడివేడిగా సాగుతున్నాయి. కేంద్రం పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిన నేపథ్యంలో అసెంబ్లీలో తీర్మానం పెట్టేందుకు జరిగిన చర్చల్లో అధికార, విపక్షాల మధ్య వాదోపవాదాలు సాగాయి. అయితే ఈ సమావేశాల్లో సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు, ఇతర సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఎమ్మెల్యేలు చర్చల్లో పాల్గొననున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 నియోజకవర్గాల్లోనూ వివిధ సమస్యలున్నాయి. సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలు, జనం గోడును అధ్యక్షా..! అని వినిపించాల్సి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుండగా విపక్షం నుంచి మాజీ సీఎం, మాజీ మంత్రి కూడా సభలో ఉన్నారు. రెండు పక్షాల నుంచి బలమైన నాయకత్వం అసెంబ్లీలో ఉన్నందున అధిక నిధుల్ని సాధించి పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పలు తాగునీటి ప్రాజెక్టులున్నాయి వీటిల్లో కొన్ని ప్రారంభ దశలో ఆగిపోగా ఇంకొన్ని మధ్యలో నిలిచిపోయాయి. కొనసాగింపు పనులు సైతం పూర్తి కాలేదు. కరువు పీడిత ప్రాంతంగా సాగునీటి ఎద్దడి నెలకొన్ని నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలకు సాగునీటి ప్రాజెక్టుల్ని గత ప్రభుత్వం ప్రారంభించింది. సింగూరు జలాల్ని లిఫ్టుల ద్వారా రెండు నియోజకవర్గాలకు నీరందించేందుకు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శంఖుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలను కొనసాగిస్తామని చెప్పలేదు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ప్రాధాన్యత తాగునీటి ప్రాజెక్టుల జాబితాలో సంగమేశ్వర, బసవేశ్వర రెండూ లేవు. అంటే వాటికి ఈ బడ్జెట్‌లో నిధులు ఇస్తారా..? ఇవ్వరా..? అసలు ఆ ప్రాజెక్టుల ఉనికి ఏమిటనేది తేల్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆ రెండు ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం ద్వారా కరువు పీడిత ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యే అవకాశముంటది. హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టు కూడా అసంపూర్తిగానే ఉంది. నిర్వాసితుల సమస్యల, పెండింగ్ పనులు ఆగిపోయాయి. సాగునీటిని ఇచ్చే స్థాయిలో ప్రాజెక్టును పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. సింగూర్ ప్రాజెక్టు అనుసందా నంగా పంట కాల్వల పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన పొన్న ప్రభాకర్ ప్రస్తుత ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్నారు. నిధులు సాధించి త్వరిత గతిన పూర్తి చేయాలి.

సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ

గత ప్రభుత్వం మెట్రోలైన్‌ను ఇస్నాపూర్ వరకు విస్తరిస్తామని ప్రకటించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంగారెడ్డి వరకు విస్తరిస్తామని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. మెట్రో విస్తరణ ప్రాజెక్టులో సంగారెడ్డి వరకు పొడగించేందుకు అవసరమైన నిధుల్ని మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఐఐటీ, ఇంటర్నేషనల్ స్కూల్స్, ఐదారు మెడికల్ కళాశాలలు, వందలాది పరిశ్రమలు విస్తరించిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు మెట్రో లైన్ విస్తరణ ఎంతో మేలు చేస్తుంది. మెట్రో విస్తరణ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన అవసరముంది.

ట్రిబుల్ ఆర్ నిర్వాసితులకు పరిహారం

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి మూడు జిల్లాల పరిధిలో ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టు విస్తరించనుంది. మూడు జిల్లాల్లో కలిపి 110 కిలో మీటర్ల మేర ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇందు కోసం వేలాది ఎకరాల భూముల్ని సేకరిస్తున్నారు. రైతుల భూములకు మార్కెట్‌లో కోట్లు పలుకుతుంది. ప్రభుత్వం మాత్రం అరకొర పరిహారమే ఇస్తుంది. దీంతో నర్సాపూర్, సంగారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గాల్లోని రైతులు భూ సేకరణ పనుల్ని అడ్డుకుంటున్నారు. రైతులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని రైతు సంఘాలు పోరాడుతున్నాయి. అదే విధంగా నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించే భూములకు కూడా మెరుగైన పరిహారం ఇవ్వాల్సి ఉంది. వీటికి అవసరమైన నిధుల్ని కూడా ఇవ్వాలని ఎమ్మెల్యేలు మాట్లాడితే మేలు చేకూరనుంది.

సంక్షేమ శాఖలకు నిధుల కేటాయింపు

ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలున్నాయి. అత్యధికంగా దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలున్నారు. వీరి సంక్షేమం కోసం పనిచేయాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు నిధుల్లేవు. మూడేళ్లుగా నిధుల్లేక సంక్షేమ పథకాలకు విరామం పలికిరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన దళిత, బీసీ, మైనార్టీ డిక్లరేషన్లలో ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్ కేటాయించి సంక్షేమ పథకాల్ని అమలు చేయాలి. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులో ఎస్సీ రిజర్వుడ్ నుంచి గెల్చిన దామోదర రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారు. అలాగే హుస్నాబాద్ నుంచి గెల్చిన పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇద్దరు మంత్రులు సంక్షేమ శాఖలకు అధిక నిధులు కేటాయించేలా చూడాలి.

ప్రజా సమస్యల్ని ప్రస్తావిస్తా

చింత ప్రభాకర్, సంగారెడ్డి, ఎమ్మెల్యే



అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యల్ని ప్రస్తావిస్తం. పార్టీ పరంగా రాష్ట్ర వ్యాప్త సమస్యలపై కొట్లాడుతున్నం. కేంద్రం పెట్టిన బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నాం. అవసరమైన ఢిల్లీ స్థాయిలో పోరాడేందుకు బీఆర్ఎస్ సిద్దంగా ఉంది. మెట్రో విస్తరణ, సంగారెడ్డిలో ఐటీ హబ్, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే విషయాల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

నారాయణఖేడ్ అభివృద్ధికి అధిక నిధులు తెస్త

పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే



బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ అభివృద్ధికి నోచలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధిని సాధిస్తాం. తాగు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. వెనుకబడిన ప్రాంతంలో వలసల్ని నివారించేందుకు పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సహకాలిస్తుంది. పెట్టుబడుల్ని ఆకర్షించడం, భూములు, నీటి వసతి వంటి రాయితీలివ్వడం ద్వారా నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమల్ని నెలకొల్పేలా ప్రయత్నిస్తాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు రోడ్లు, భవనాల నిర్మాణం కోసం అవసరమైన నిధుల్ని సాధిస్తా.

కార్పొరేట్లకు రాయితీలు.. పేదలపై భారాలు

నవతెలంగాణ-సదాశివపేట



బడా కార్పొరేట్లకు రాయితీలు.. పేద ప్రజలకు భారాలు వేసే తీరుగా కేంద్ర బడ్జెట్ ఉన్నదని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల ధరలు 3.5శాతం నుంచి 7.5శాతం పెరిగినా.. వాటి నియంత్రణ గురించి కనీసం బడ్జెట్లో ప్రస్తావన లేదన్నారు. ప్రభుత్వ వ్యయాన్ని మరింతగా కుదించారన్నారు. సబ్సిడీల్లో గణనీయంగా కోత విధించారన్నారు. ఎరువుల సబ్సిడీని రూ.24,894 కోట్ల మేరకు కోత విధించారని మండిపడ్డారు. ఆహార సబ్సిడీని రూ.7082 కోట్ల మేరకు కోత పెట్టారన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను మరింతగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఉపాధి కల్పనలోనూ మొండిచేయే దక్కిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి 4మాసాల్లో ఇప్పటికే రూ.41,500కోట్లు ఖర్చు పెట్టగా, మిగిలిన 8 మాసాల కాలంలో కేవలం రూ.44,500కోట్లు మాత్రమే ఖర్చుపెట్టేలా ఉన్నదని ఆరోపించారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపే లేకపోవడం దారుణమన్నారు. దేశ ప్రజలు, ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ప్రజల మధ్య వైషమ్యాలు.. దేశాభివృద్ధికి ఆటంకాలు

- మతోన్మాద దాడులకు అడ్డుకట్ట వేయాల్సిందే..
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- ప్రజా సంక్షేమం మరిచి మతపరమైన పాలన చేయడం సరికాదు
- సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దీన్
- మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా సదస్సు

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజల మధ్య బీజేపీ కేంద్ర ప్రభుత్వం వైషమ్యాలను పెంచి పోషిస్తుందని, ఈ చర్య దేశాభివృద్ధికి ఆటంకంగా మారుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో సీపీఐ, సీపీఐ(ఎం) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 'జిల్లా సదస్సు' ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చుక్క రాములు హాజరై మాట్లాడుతూ.. అమాయక ప్రజలపై మతోన్మాద దాడులు నానా టికి పెరిగిపోతున్నాయన్నారు. ఈ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. విభిన్న మతాలు సంప్రదాయాలకు ప్రతీక భారత దేశం అని గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తూ బీజేపీ పరిపాలన సాగిస్తోందన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. మాట్లాడే అవకాశం లేకుండా, ప్రశ్నించేతత్వాన్ని కాలరాయడం సమంజసం కాదన్నారు. విద్యాలయాల్లో శాస్త్రీయ విద్య బోధన జరపకుండా అడ్డుకోవడం, విద్యాలయాల్లో, హింస రెచ్చగొట్టేలా పాఠ్యాంశంలో చేర్పులు మార్పులు చేయడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. మత సాంప్రదాయాలను గౌరవిస్తూ, కులం పేరుతో, మతం పేరుతో జరిగే దాడులను అరికట్టేందుకు కమ్యూనిస్టు పార్టీలుగా ముందు బాగానా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజలను ఐక్యం కాకుండా మతం పేరుతో విచ్ఛిన్నం చేసి తన రాజకీయ స్వలాభం కోసమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెదక్ జిల్లాలో కూడా ఒక వర్గం మరో వర్గంపై దాడులకు మతోన్మాదులు ఉసిగొల్పారన్నారు. ఈ దాడులను ఎదుర్కోవాలన్న, ప్రజలకు రక్షణగా నిలవాలన్నా, వారి సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గాన్ని ఎదిరించి పోరాడేది ఎర్రజెండా, వామపక్ష పార్టీలని అన్నారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్లు మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి పూర్తిగా మతపరమైన పరిపాలన సాగించడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ ంపై వ్యతిరేకత రాకుండా మతం ముసుగులో ఎన్నాళ్లు పరిపాలన చేస్తారని ప్రశ్నించారు. ప్రజలను ఐక్యం చేసి పోరాటాలకు సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శివర్గ సభ్యు లు బీరం మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మానిక్, సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు నర్సింలు,అశోక్, కృష్ణ, రాజయ్య, పన్యాల వాజీర్ బేగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.మహబూబ్ ఖాన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజారుద్దీన్ కాశీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పై బీజేపీ వివక్ష..

నవతెలంగాణ-జోగిపేట



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై వివక్షత చూపుతోందని, బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం ఎంపీల వైఫల్యం అని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. అందోల్‌లోని ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం కేక్ కట్ చేసి.. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రాంతాన్ని పట్టించుకోవట్లేదన్నారు. ఏపీకి రూ.15వేల కోట్లు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి ఎందుకు ఇవ్వలేదని బీజేపీ ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. ట్యాక్సులు కట్టించుకొని నిధులు మాత్రం కేటాయించరా ఇది ఎక్కడి న్యాయమన్నారు. విభజ న హామీలో భాగంగా తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఎంఎం, ఐటీఐఆర్, ప్రాజెక్టు లకు జాతీయ హోదాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల్లోపే రెండు పార్టీల ఎంపీలు నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తెలంగాణ ప్రజలు విశ్వసించరన్నారు. నిధులు రాకుంటే తెలంగాణ ఉద్యమం కంటే తీవ్రంగా బీఆర్ఎస్ పక్షాన ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీసీబీ వైస్‌చైర్మెన్ పి.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు హెచ్. రామాగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మెన్ డీబీ నాగభూషణం, పుల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాయిపేట విజయ్‌కుమార్, పార్టీ పట్టణాధ్యక్షుడు సార శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం, మొగులయ్య, రాజు, జిన్నా విజయ్‌కుమార్, గోపాల్, పత్తి వీరేశం, సంతోష్‌కుమార్, దుర్గేష్ పాల్గొన్నారు.

రైల్వే, నీటి ప్రాజెక్టులు, రోడ్లకు నిధులు కేటాయించాలి

- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు తీవ్ర అన్యాయం
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, ఉమ్మడి మెదక్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య అన్నారు. బొల్లారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మంత్రులు, బీజేపీ ఎంపీలు అందరూ నిధులు తేవడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఈ బడ్జెట్లో కార్మికుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కార్మికుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యం వహించారని, వెంటనే బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా వెనుకబడిన ఉన్నదని.. ప్రత్యేకంగా రైల్వే విషయంలో జిల్లాకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. కాబట్టి రైల్వే లైన్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నుంచి కరీంనగర్ వరకు అలాగే రామచంద్రపురం నుంచి సంగారెడ్డి, జోగిపేట, మెదక్ మీదుగా రైల్వే లైను గతంలో ప్రతిపాదన ఉందని దానిని పూర్తిగా తుంగలో తొక్కారన్నారు. అలాగే జహీరాబాద్ నుండి నారాయణఖేడ్ మీదుగా రైల్వేలైన్ ప్రతిపాదన గతంలో ఉందని దాన్ని ఉసెత్తలేదన్నారు. అలాగే మెట్రోలైన్, ఎంఎంటీఎస్‌ల గురించి గానీ రైల్వే ప్రతిపాదన ఏ మాత్రం లేదన్నారు. మెదక్ ఎంపీ నోరు తెరవాలని.. నిధులు సాధించాలని ఆయన సూచించారు.అలాగే ప్రాజెక్టుల గురించి కూడా నిధులు ఏమాత్రం కేటాయించలేదని, రోడ్ల కు నిధులు కేటాయించాలన్నారు. కాకుండా కార్మికుల సమస్యల గురించి ఏమాత్రం ప్రస్తానం లేదని, నిధులు కేటాయించలేదని ఆయన అన్నారు. కనీస వేతనం ఊసే లేదన్నారు. కొత్త ఉద్యోగాలు కల్పన గురించి కనీసం చర్చలేదని దుయ్యబట్టారు. పూర్తిగా ఈ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, కార్మికులకు, ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి.. బడ్జెట్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎవరెస్ట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సదాశివపేట



ఆరూర్ గ్రామ పరిధిలోగల ఎవరెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కాలుష్య జలాలు వెదజల్లుతున్నదని.. దాంతో ప్రజలు, జంతువులు, చేపల మనుగడ ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో పలు గ్రామాల ప్రజలతో వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతుసంఘం, కేవీపీఎస్ ప్రజా సంఘాల నాయకులు బుధవారం చర్చించారు. వెంటనే సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నర్సిములు మాట్లాడుతూ.. పెద్దగోపులారం, ఆరూర్, కోనాపూర్, నాగులపల్లి, ఆత్మకూర్ కాలువల గుండా మంజీరాలో ఈ కాలుష్య జలాలు కలుస్తున్నాయని.. తద్వారా ప్రజలకు, జంతువులకు నీటిలో ఉండే చేపలకు మనుగడ ప్రమాదకరంగా మారుతున్నదన్నారు. పెద్దగోపులారం గ్రామానికి సంబంధించిన లక్ష్మీనారాయణ చెరువు ఎవరెస్టు కంపెనీ కింది భాగాన ఉందన్నారు. అయితే చెరువు కట్ట ధ్వంసం కావడంతో విషజలాలు వర్షాలు కురిసే సమయంలో కంపనీ వెనక భాగం నుంచి చెరువులోకి వదులుతున్నారన్నారు. రెండేండ్ల క్రితం పెద్దఎత్తున వర్షాలు కురవడంతో కెమికల్ జలాలు వదిలినప్పుడు.. ఆత్మకూర్ పెద్దవాగులో చేపలు కూడా మృత్యువాత పడ్డాయని గుర్తు చేశారు. పెద్దగోపులారం గ్రామంలో తాగడానికి ఉపయోగించే బోర్లలో సైతం కలుషితం నీరే వస్తుండడంతో.. మినరల్ వాటర్ మాత్రమే కొనుక్కుని తాగాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై అనేక సందర్భాలలో రైతులు, గ్రామ ప్రజలు అధికారులకు విన్నవించినా.. అధికారులు వచ్చి చూసి వెళున్నారే తప్పా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షు లు టి.యెషోబు, జిల్లా సహాయ కార్యదర్శి కుమార్, రైతు సంఘం మండల నాయకులు అశోక్,బాల్రాజ్, కేవీ పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి, ఎంపీవోలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని మాచూనూర్ గ్రామంలో అసైన్మెంట్ స్థలాన్ని పట్టాగా మార్చి అవకతవకలకు పాల్పడిన గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీవోలపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ రాజు, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు నర్సింలు, రత్నము, లక్ష్మయ్యలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 మార్చి 2024 నుంచి వారు అవకతవకలకు తెరలేపుతున్నారన్నారు. గ్రామంలోని ఖాళీ స్థలలాకు సైతం ఇంటి నెంబర్లు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అదే విధంగా కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని కూడా కొందరికి కేటాయించారన్నారు. ఆ ఇద్దరు అధికారులు బదిలీపై వెళ్ళుతున్నారని వారిని రిలీవ్ చేయకూడదని ఎంపీడీవో సుధాకర్‌కు తెలియజేసినా.. అవేమి పట్టనట్టుగా వ్యవరించి వారిని ఇక్కడి నుంచి రిలీవ్ చేయడం సరికాదన్నారు. రెండ్రోజుల క్రితం రాత్రికి రాత్రే 23 మందికి అసెస్మెంట్ చేశారన్నారు. ఈ విషయంలో ఎంపిడివో పాత్ర ఉండడం వల్లే అవకతవకలకు పాల్పడిన అధికారులుకు వత్తాసు పలుకుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బోనాల జాతరకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-మనూర్

మండలంలోని దోసపల్లి గ్రామంలో ఈనెల 28న బోనాల పండుగ నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు రావాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవ్‌రెడ్డికి హైదరాబాద్‌లో టీరదార్ దత్తు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, నారాయణఖేడ్ మున్సిపాల్టీ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, చంద్రశేఖం రెడ్డి, నగేష్ షెట్కార్‌లను ఆహ్వానిస్తామని దత్తు తెలిపారు.

పెంపుడు కుక్కలకు గుర్తింపు కార్డులు పొందాలి



నవతెలంగాణ-జహీరాబాద్

పెంపుడు కుక్కలకు వాటి యజమానులు గుర్తింపు కార్డులను పొందాలని మున్సిపల్ కమి షనర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుండడంతో.. వాటిని తరలిస్తున్నట్టు చెప్పారు. పట్టణంలోని వార్డ్ నెంబర్ ఒకటి అమ్మ గుళ్ళ వద్ద ఉన్న వీధి కుక్కల తరలింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. తగు జాగ్రత్తలు తీసుకొని కుక్కలను తరలించాలని కార్మికులకు సూచించారు. ఎవరైనా కుక్కలను పెంచుకుంటే వాటికి సంబంధించిన సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. పెంపుడు కుక్కలు ఎవరికైనా హాని కలిగిస్తే పెంచిన యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం జాతీయ రహదారి 65పై నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు.కార్యక్రమంలోశానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి, రాజు,రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలి

- కొత్త ఋణాలు మంజూరు చేయాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



నవతెలంగాణ-కల్హేర్

ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ డబ్బులను రైతుల సేవింగ్ ఖాతాల్లో వెంటనే జమ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మండల కేంద్రమైన కల్హేర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రుణమాఫీ, రుణాల రెన్యువల్ ప్రక్రియలను పరిశీలించారు. బ్యాంకు పరిధిలో మొత్తం ఎంతమంది రైతులకు రుణమాఫీ లబ్ధి పొందారు అనే వివరాలను బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లక్ష లోపు రుణాలు ఉన్న 660 మంది రైతులకు ఋణమాఫీ వచ్చిందని బ్యాంక్ మేనేజర్ జాదవ్ సంతోష్ కలెక్టర్‌కు తెలిపారు. ఇప్పటివరకు 120 మంది రైతుల బ్యాంకు సేవింగ్ ఖాతాలలో కోటి రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 440 మంది రైతుల ఋణమాఫీ డబ్బులు వారి సేవింగ్ ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు. రుణాలు సైతం ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు 1బి తీసుకురాగానే వెంటనే షెడ్యూల్ చేసి రుణమాఫీ డబ్బు లు అందజేస్తున్నట్టు బ్యాంకు సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు రుణమాఫీపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం కల్హేర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసారు. ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మూడో, నాలుగో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. విద్యార్థులతో గుణిజాలు చదివిపించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి బోర్డుపై రాయించారు. ప్రతీ విద్యార్థి చిన్ననాటి నుంచే బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

తదనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి.. బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఆరుగురు గర్భిణీ స్త్రీలు ముగ్గురు బాలింతలు ఉండగా ఆరుగురు అంగన్వాడి కేంద్రానికి వచ్చి భోజనం చేస్తున్నట్టు అంగన్వాడి టీచర్ కలెక్టర్‌కు తెలిపారు. ముగ్గు రు బాలింతలు వ్యవసాయ పనుల కారణంగా భోజనాన్ని మధ్యాహ్నం ఇంటికి తీసుకు వెళ్తున్నారన్నారు. గుడ్లు, పౌష్టికా హారం సక్రమంగా అందించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని అంగ న్వాడీ టీచర్‌కు సూచించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు తీరును పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్టు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ అశోక చక్రవర్తి, ఎల్‌డీఎమ్ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ మల్లేశం, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, ఎంఈఓ శంకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ జాదవ్‌సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి 'మహిళా శక్తి రుణాలు' : కలెక్టర్



స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం 'మహిళా శక్తి పథకం' ద్వారా ప్రత్యేక ఋణాలు ఇవ్వాలని ఆదేశించినట్టు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. కల్హేర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మహిళా సమాఖ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అనేక రకాల ఋణాలను రాయితీపై ఇవ్వనున్నట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఎస్‌హెచ్‌జి లింకేజీ మండల సమైక్య జిల్లా సమైక్య సీఐఎఫ్ నిధులతో సంఘాలకు ఋణాలు ఇవ్వనట్టు చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు ఆయా మండలాలకు కేంద్రాలు, గ్రామాల్లో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు చేస్తే మంచి లాభాలు వస్తాయో అలాంటి యూనిట్లను స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెటర్నరీ విభాగంలో పాడి గేదెల పెంపకం, డైరీ ఫామ్ ఏర్పాటు, కోళ్ల ఫారాలు, కస్టం హేరింగ్ సెంటర్, క్యాంటీన్‌లు, ఇతర ఆహార శుద్ధి యూనిట్లు, పాల కేంద్రాల ఏర్పాటు లాంటి పథకాలు ఉన్నట్లు తెలిపారు. మహిళలు ఏ యూనిట్ ఏర్పాటు కోసం ఋణాలు తీసుకుంటున్నారో ఆ యూనిట్లను ఏర్పాటు చేసుకొని సమర్థవంతంగా నిర్వహించి నప్పుడే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబానికి ఆసరాగా నిలుస్తారన్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం డిఆర్డిఏ మహిళలకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసు కొని వారి వారి గ్రామాలలో మండల కేంద్రాలలో లాభాలు వచ్చే యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ, డీఆర్‌డీఓ జ్యోతి, అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి, ఆర్‌డీఓ అశోక్ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాస్, మహిళా సమైక్య అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, మాజీ ఆత్మ చైర్మెన్ విజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మెన్ అల్లాడి నర్సింలు, తంజీమ్, మాజీ పట్టణాధ్యక్షులు యాకూబ్, మోహియొద్దిన్, పార్టీ జహీరాబాద్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

10వ వార్డులో వన మహోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా బుధవారం జోగిపేట మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో కౌన్సిలర్ పట్లోళ్ల రేఖా ప్రవీణ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యతను ప్రతీ ఒక్కరు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలను అందిస్తావ ఎన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జి.మల్లయ్య,కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్‌లు రంగ సురేష్, కోరబోయిన నాగరాజ్,శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినయ్, బిక్షపతి, జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల మధు, గుర్రపు కృష్ణ, మోదిని రాజు, కాలనీ వాసులు ఆకుల నాగేష్, సుధాకర్, బాబా, మహిళలు మహంకాళి శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రైతుబీమా దరఖాస్తు స్వీకరణ



నవతెలంగాణ-న్యాల్‌కల్

కొత్తగా పట్టా పాస్ పుస్తకం వచ్చినవారు ఆగస్టు 5వ తేదీలోపు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల ఏవో లావణ్య సూచించారు. మండలంలోని మామిడ్గి, రేజింతల్, ముంగి, న్యాల్‌కల్, చాల్కి వ్యవసాయ రైతువేదిక క్లస్టర్లలో రైతుబీమా దరఖాస్తులను ఏఈవోలు బుధవారం నమోదు చేసుకున్నారు. రైతు బీమాలో మార్పులు చేర్పుల కోసం ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు షరీఫ్ , సనిత్ రెడ్డి , మాధవి , నికిత , అర్చన, రైతులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన.. ఆందోళనలో రైతన్న

నవతెలంగాణ-మనూర్

గత 8 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. పంట పొలాలన్నీ నీటితో నిండి.. పంటలు మొత్తం మునిగిపోతున్నాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో మొక్కలు పాడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, పెసర, మినుము పంటలకు ప్రస్తుతం ఎరువులు వేసే సమయని.. కానీ చేన్లు మొత్తం నీటితో నిండి ఉండడంతో వేయలేని దుస్థితి నెలకొన్నది. తద్వారా పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వర్షం తగ్గితే బాగుండు అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత పదేండ్లలో ఇలాంటి బడ్జెట్ చూడలేదు



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని.. గత పదేండ్లలో ఇలాంటి బడ్జెట్ ఎప్పుడూ చూడలేదని సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మెన్ నరహరిరెడ్డిలు ఆరో పించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులతో కలిసి బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ నుంచి పెద్దమొత్తంలో కేంద్రానికి పన్నులు పోతున్నా.. నిధుల కేటాయిం పులో మాత్రం మొండిచేయి ఇచ్చారన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మిగతా ఎంపీలు ఈ విషయాన్ని ప్రస్తావించి.. బడ్జెట్‌లో సవరణ కోరాలన్నారు. బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు వస్తాయని మాయమాటలు చెప్పారని.. సీట్లు వచ్చినా నిధులు మాత్రం రాలేదన్నారు. రైల్వే లైన్, ట్రిబ్యునల్ విషయంలో, రోడ్ల, ప్రత్యేక నిధుల కేటాయింపులో తెలంగాణ గుర్తుకు రాలేదాఅని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి కేంద్రంతో లోపాయికారీ ఒప్పందం ఉన్నదా అని ఆరోపించారు. బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. అఖిల పక్షంతో పార్లమెంటుకు వెళ్లే విధంగా సీఎం వెంటనే చొరవ తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మ్యాకం విఠల్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆసుపత్రిలో రేపు రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

దేశం కోసం అసువులు బాసిన వీర జవానుల యాదిలో రేపు(శుక్రవారం) నారాయణఖేడ్‌లోని మహాలక్ష్మి ఆసుపత్రిలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్టు బ్లడ్ డోనర్స్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికుల స్ఫూర్తితో.. అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరం ఉన్న వారికీ రక్తదానం చేయాలన్నారు. ఈ మంచి ఉద్దేశంతోనే రేపు ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 7989894520, 6305043932, 9494606674, 9963104353ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ వ్యవస్థాపకులు ముజాహెద్ చిస్తీ, సభ్యులు ఓంప్రకాష్, కొఠారి నర్సింలు, లక్ష్మణ్, మోహన్ తదితరులు ఉన్నారు.

సిద్ధివినాయక ఆలయానికి సందర్శకుల తాకిడి



నవతెలంగాణ-న్యాల్‌కల్

సంకట చతుర్థిని పురస్కరించుకుని రేజింతల్ సిద్ధివినాయక ఆలయం బుధవారం సందర్శకులతో కిటకిటలాడింది. సమీప పట్టణాలతో పాటు వివిధ గ్రామాల నుంచి పాదయాత్రగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచే ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకు న్నారు. కాగా భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన ప్రసాదాలు అందజేశారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని బొల్లారం మున్సిపల్ బీజేపీ టౌన్ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ, జిల్లా పార్టీ అధ్యక్షురాలు సి. గోదావరి అంజిరెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ మున్సిపల్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కేజెఆర్ ఆనంద్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలో బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతం తోపాటు అన్ని మోర్చ కమిటీలు పూర్తి స్థాయిలో నియమించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు ప్రజల తరపున పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వి. ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి డి. స్రవంతి రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు టీ. రవీందర్ రెడ్డి, వి.భరత్ చారి, సీనియర్ నాయకులు జి. రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు విచారకరం



నవతెలంగాణ-వట్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నారని.. ఇది చాలా విచారకరమని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రమైన వట్‌పల్లిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. రాజకీయాలు అంటే అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండాలి తప్పా.. వివాదాలకు పోయి దాడులకు పాల్పడడం కాదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇలాంటి దాడులకు పాల్పడలేదన్నారు. టేక్మల్ మండలం లోని షాబాద్ తాండాలో మంత్రి దామోదర్ అనుచరులు అక్రమ భూకబ్జాలకు పాల్పడుతూ.. పట్టాదారును బెదిరించి వారిపైనే దాడులకు పాల్పడ్డాడని ఆరోపించారు. బాధితులు పోలీసులను ఆశ్రయించినా.. దాడులకు పాల్పడిన వారికే పోలీసులు మద్దతుగా ఉంటున్నారని.. ఇది సరికాదన్నారు. గొల్లెకల్ గ్రామంలో కూడా 124 సర్వే నంబర్లో పట్టాదారులను బెదిరించి కొందరు అక్రమ భూకబ్జాకు పాల్పడ్డారని.. పైగా బాధితులపై డీఎస్పీకి నిందితులే ఫిర్యాదు చేశారన్నారు. డీఎస్పీ కూడా కబ్జాదారులకు అనుకూలంగా ఉండి.. కోర్టును ఆశ్రయించాలని అసలైన పట్టాదారులకు ఉచిత సలహాలు ఇచ్చి పంపించారని ఆరోపించారు. మండల సర్వేయర్ టిఫన్ సాయంతో 124 సర్వే నెంబరు భూమి హద్దులను గుర్తించేందుకు రాగా.. పట్టాదారులతో ఘర్షణ పడి సర్వేయర్ హద్దులను గుర్తించకుండా అడ్డుకున్నారని.. అది కూడా నేరమేనన్నారు. కాబట్టి పోలీసుల తీరులో మార్పు రాకపోతే బీఆర్‌ఎస్ పరంగా ఆందోళనలకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చ రించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఆత్మస్థైర్యాయం కోల్పోకుండా ధైర్యంతో ముందుకు సాగాలని.. ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ శివాజీ రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నర్సింలు, మాజీ సర్పంచ్‌మహమ్మద్ సత్తర్మియా, బుద్ధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం



నవతెలంగాణ-అమీన్‌పూర్

మున్సిపాల్టీ పరిధిలోని కాలనీల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం పనిచేయడం జరుగుతున్నదని అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సాయి అంబికా ఫేస్‌వన్ కాలనీ మిషన్ భగీరథ పైప్ లైన్ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా ప్రతీఇంటికి మంచినీళ్లు అందించే విధంగా పనిచేస్తున్నామన్నారు. కావున అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

75వ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి - కమిషనర్ జ్యోతి రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి కోరారు. అమీన్పూర్ మున్సిపాల్టీ పరిధిలోని రాజేశ్వరి పేస్ టూ కాలనిలో 75వ వనమావస్తవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75 వన మహోత్సవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు. అదేవిధంగా మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు కాలనీ వాసులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-కల్హేర్

వర్షాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను గ్రామ విస్తరణ అధికారి(ఏఈఓ) దగ్గర తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మరియు నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతుబీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఏడిఏ నూతన్ కుమార్ సూచించారు. స్థానిక ఏఈఓ విస్తరణాధికారి కృష్ణవేణితో కలిసి నిజాంపేట మండలంలోని మునిగేపల్లి గ్రామంలో బుధవారం పంట నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ నూతన్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని రైతులు వర్షాకాలంలో తమ వ్యవసాయ భూములలో ఏ ఏ సర్వే నంబర్లలో ఏ ఏ రకమైన పంటలను సాగు చేస్తున్నారో.. పంటల వివరాలను గ్రామ ఏఈవో దగ్గర తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అంతేకాక ఇటీవల కాలంలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు ఇదివరకు రైతు బీమా లేని వారు రైతుబీమా కోసం ఏఈఓ దగ్గర దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పత్తి పంటను పరిశీలించి.. తుఫానుతో కూడిన వర్షాలు కురుస్తున్నందున పత్తి పంటలో వర్షపు నీరు నిల్వ కాకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ నవాబ్ పటేల్, ఏఈఓ కృష్ణవేణి, గ్రామ రైతులు తదితరులు, పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి మొండిచేయి ఇచ్చిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.రాజేష్ అన్నారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక న్యూ బస్టాండ్ వద్ద తల లేని కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మని దహనం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. కేంద్రం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ విద్యారంగానికి తీవ్ర మొండిచేయి చూపించిందన్నారు. దేశంలో విద్యాభివృద్ధి కోసం కనీసం కేటాయించాల్సిన నిధులను కేటాయించలేదన్నారు. గత ఓటాన్ బడ్జెట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు , ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ కు కేవలం 0.1 మాత్రమే బడ్జెట్‌ను పెంచారన్నారు. బడ్జెట్ మొత్తంలో పెరిగినట్టు ఉన్నా.. గతం కంటే విద్యారంగానికి బడ్జెట్ తగ్గిందన్నారు. గత మొత్తం బడ్జెట్ రూ.45,03,638 కోట్ల నుంచి 48,21,000 కోట్లకు పెరిగింది. అంటే 7 శాతం బడ్జెట్ పెరిగింది. కానీ విద్యారంగానికి తీవ్రంగా నిధులను తగ్గింపు చేశారన్నారు. బడ్జెట్‌ను సవరించి, విద్యా అభివృద్ధికి ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్యాభివృద్ధి కోసం చర్యలు తీసుకొని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రజినీకాంత్, నాయకులు అర్జున్, నితిన్, కుమార్, డేవిడ్, శ్రీధర్, శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. కార్మికుల బతుకులు మారడం లేదు

- కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలి
- వేతనాలు ఇవ్వకపోతే విధులు బహిష్కరిస్తాం
- మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

ఎం.యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వం మారినా.. కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని జహీ రాబాద్, కోహిర్, మీర్జాపూర్ ప్రభుత్వ ఏరియా హాస్పిట ల్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. గత 4 నెలల నుంచి వేతనాలు రాక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని.. అయిన ప్పటికీ జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. అధికారులు కాంట్రాక్టర్లకు అనుకూలంగా తయార య్యారని ఆరోపించారు. వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున కాంట్రాక్టర్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మానేయ్య, లక్ష్మీ, సంగీత, సుజాత, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..



నవతెలంగాణ-రామచంద్రాపురం

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నాయకులు ఆదర్శరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, పటాన్చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ప్రస్తావన లేకుండా మొట్టమొదటిసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. కాంగ్రెస్ నుంచి 8, బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి ఏ ఒక్క ప్రాజెక్టు రాకపోవడం సిగ్గుచేటన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హెూదా.. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే, ఆదివాసులకు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రోడ్డు, మియాపూర్ నుండి సంగారెడ్డి వరకు మెట్రో రైలు, ఎంఎంటీఎస్ రైలు సంగారెడ్డి వరకు పొడగింపు, వట్టినాగులపల్లి నుండి జోగిపేట్ వరకు రైలు వంటివి ఏవీ కూడా బడ్జెట్ ప్రస్తావనలో లేకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ హయాంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎన్నో ప్రతిపాదనలు పెట్టి రాష్ట్రానికి నిధులు రాబట్టామని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉండి రాష్ట్రానికి ఏ ఒక్క ప్రాజెక్టు ఒక్క పైసా కూడా తీసుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి 16 సీట్లు తెచ్చుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి రూ.15వేల కోట్ల సాయాన్ని పొందిందని గుర్తు చేశారు. కేంద్రం గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ రాష్ట్రంలో అభివృద్ధి కోసం ఎవరు కూడా నిధులు వెచ్చించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య, తెలంగాణ ఉద్యమ నేత వెంకటేష్‌గౌడ్, మాజీ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కుమార్ గౌడ్, నాయకులు సత్యనారాయణ, నరసింహ, కుత్బుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు





నవతెలంగాణ-సంగారెడ్డి, కొండాపూర్

విద్యారంగానికి 30శాతం అధిక నిధులు కేటాయించాలని, పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ బుధవారం ఇచ్చిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమానికి తాము వెళ్లకుండా అర్ధరాత్రి నుంచే అరెస్టులు చేయడం సరికాదని.. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్, ఉపాధ్యక్షులు సందీప్ అన్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పీఎస్ వద్ద సురేష్, కొండాపూర్ పీఎస్ వద్ద సందీప్‌లు వేర్వేరుగా మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో బస్టాండ్‌ల వద్ద, నాయకుల ఇంటి వద్దకు వచ్చి అరెస్టులు ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. సరిపడా నిధులు కేటాయించకుండా గత ప్రభుత్వం అవలంబించిన మాదిరిగానే విద్యార్థి, ప్రజా వ్యతిరేక విదానాలనే అవలంభిస్తున్నదన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. గురుకులాలకు పక్కా భవనాలు లేకపోవడంతో.. వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలపై పర్యవేక్షణ లేకపోవడంతో.. ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థుల ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలంటే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ ఉన్నతాధికాలను నియామకాలు జరగాలన్నారు. ఇవన్నీ కూడా రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుపైనే ఆధారపడి ఉన్నాయని.. కాబట్టి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అరెస్ట్ అయిన వారిలో డివిజన్ నాయకులు, సిద్దు, ఆకాష్, సమీ, శివ, అనిల్, నితిన్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు



నవతెలంగాణ- కొండాపూర్

మండల పరిధిలోని తొగర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారికి బుధవారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ భీమ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ సందగళ్ళ సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ బాధ్యతగా విధులు, తమ జీవిత చక్రాన్ని ఏ విధంగా మలుచుకోవాలని సూచనలు సలహాలు ఇస్తూ, పాఠశాలను క్రమశిక్షణగా నిర్వహించారని కొనియాడారు. ఉపాధ్యాయులతో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం వారి సేవలు గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్, ఉపాధ్యాయులు వాని, నరేందర్, గ్రామస్తులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు..

నవతెలంగాణ
మెదక్
78
గురువారం | 25 జులై 2024 | www.navatelangana.com

మెరుగైన పరిహారం కోసం కృషి చేస్తా



- కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-నర్సాపూర్

రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి మెరుగైన పరిహారం వచ్చేలా కృషి చేస్తానని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రైతులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రీజనల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోతున్న రత్నాపూర్, చిన్న చింతకుంట గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించడం కోసం ఇప్పుడున్న మార్కెట్ రేటు ప్రకారం చెల్లించడం కోసం జిల్లా కమిటీని వేశామని దాని ద్వారా మార్కెట్ రేటు సవరించామన్నారు. దాని ద్వారా రైతులకు సరైన పరిహారం లభిస్తుందని తెలిపారు. కొందరు రైతులు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని కోరగా చట్టంలో అటువంటిది ఏమీ లేదని భూమికి బదులుగా భూమి ఇవ్వడం సాధ్యపడదని సూచించారు. భూ సేకరణ కోసం రైతుల సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, నర్సాపూర్, శివంపేట తాహసీల్దారులు కమలాద్రి, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలను సీజ్ చేసిన ఎంఈఓ



నవతెలంగాణ-కొల్చారం

మండల కేంద్రమైన కొల్చారంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న లేక్ వ్యూ టాలెంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను బుధవారం ఎంఈఓ నీలకంఠం సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న పాఠశాల గుర్తింపును జిల్లా విద్యాశాఖ అధికారి గత నెలలో రద్దు చేశారు. అయినప్పటికీ పాఠశాల కొనసాగిస్తుండడంతో బుధవారం ఎంఈఓ నీలకంఠం సిబ్బందితో కలిసి పాఠశాలకు వెళ్లి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల గుర్తింపును రద్దు చేసినట్లు తెలిపారు. గుర్తింపు రద్దు చేయడం వల్ల పాఠశాల విద్యార్థుల పేర్లు యుడైస్‌లో నమోదు కానందున విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ పాఠశాలలో చేర్పించవద్దని సూచించారు. ఇప్పటికైనా పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించి తిరిగి గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందిన తరువాత పాఠశాలను ప్రారంభించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సాయి కుమార్, తదితరులు ఉన్నారు.

నిత్యావసర వస్తువుల సరఫరా సమర్థవంతంగా నిర్వహించాలి

- వసతిగృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి
- అధికారులు తప్పనిసరిగా వేయింగ్ మిషన్స్ తనిఖీ చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

జిల్లాలో పౌరసరఫరాల నిత్యవసర వస్తువుల సరఫరా, పగడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ రెవిన్యూ చాంబర్లో జిల్లా పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సమావేశం సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా పంపిణీ జరుగుతున్న పీడీఎస్ కార్డు యొక్క వివరాలు, క్వాలిటీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా రేషన్ షాపులో ఉన్న ప్రతి వేయింగ్ మిషన్ తనిఖీ చేసి ఎక్కడైనా తేడాలు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసీడీఎస్‌కు నాణ్యత బియ్యం డెలివరీ చేయాలని టెక్నికల్ అసిస్టెంట్లచే ప్రతినిత్యం క్వాలిటీ చెక్ చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, డీఎం సివిల్ సప్లై హరికృష్ణ, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, షెడ్యూల్ కులాల అధికారి విజయ లక్ష్మీ, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి

- హెల్త్ సూపర్వైజర్ ఉజాలరాణి



నవతెలంగాణ-నిజాంపేట

ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని హెల్త్ సూపర్వైజర్ ఉజాలరాణి అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని కే వెంకటాపూర్ గ్రామంలో బుధవారం ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండాలంటే ప్రతి ఇంటి చుట్టుముట్టు మురికి నీరు చేరకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరు నిలువకుండా చూడాలన్నారు. తొట్టిలలో, డబ్బాలలో, సీసాలలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలన్నారు. దోమల వలన అనేక వ్యాధులు సంభవిస్తాయని దోమలు రాకుండా నిద్రించేటప్పుడు దోమతెరలను వాడాలన్నారు. దోమల వలన విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రేమ, హెల్త్ వెల్నెస్ సెంటర్ స్టాపు ఎంఎల్‌హెచ్ పి.స్వాతి, ఎంపీహెచ్ ఏ రమ్య అర్చన, ఆశ, కవిత, అంగన్వాడీ టీచర్, యశోద, తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘం పరిధిలోని మహంకాళి జాతర సమీపిస్తున్నందున జాతర ఏర్పాట్లను, ఆలయం దగ్గర స్పెషల్ సానిటేషన్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. ఉజ్జయిని మహంకాళి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఖాజా మొయినుద్దీన్, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, శ్రీశైలం గౌడ్, జమాల్పూర్ లక్ష్మీబాయి నర్సోజి, కాంగ్రెస్ నాయకులు నాగరాజు గౌడ్, బొల్లు నాగులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా రుణమాఫీ

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మండల కేంద్రం లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా బ్యాంక్‌ను జిల్లా వ్యవసా య అధికారి గోవింద్ మంగళ వారం రోజున సందర్శించారు. ఎస్బీఐ బ్యాంకు పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో 772 మంది రైతులకు రూ.4.62 లక్షల రుణమాఫీ అయినట్లుగా బ్యాంకు మేనేజర్ జి. శోభన్ బాబు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌తో ప్రత్యేక సమావేశంలో బ్యాంక్ మేనేజర్ శోభన్ బాబు హాజరయ్యారు. బ్రాంచ్ మేనేజర్ శోభన్ బాబు మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో ఉన్న అన్ని గ్రామాల రుణమాఫీ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణమాఫీ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, తూప్రాన్ మండల ఏవో గంగమల్లు, తూప్రాన్ ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిని సందర్శించిన సీఐ రేణుక



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండల పరిధిలో ని షాబాద్ద, నల్లకుంట తండాల్లో భూ వివాదంపై అల్లాదుర్గ్ సీఐ రేణుక, టేక్మాల్ ఎస్ఐ మురళి బుధవారం సందర్శించి, విచారణ చేపట్టారు. 86 సర్వే నెంబర్లు 360 ఎకరాల అడవి భూమిలో కొంతమంది పోడు వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో గత కొంతకాలంగా రెండు తండల మధ్య వివాదం నెలకొంది. మూడు రోజుల క్రితం ఇరువు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేడు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి విచారణ చేపట్టారు. భూ వివాదం పరిష్కారమయ్యే వరకు ఎవరు ఈ భూమిలోకి రావద్దని ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో వివాదంపై ఇరువార్గాలు చర్చలు జరుపుకోవాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్ ఆర్ఐ సాయి శ్రీకాంత్, ఎస్ఐ మురళి, ఏఎస్ఐ తుక్కయ్య, పోలీసు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రుణమాఫీ సమస్యను జీఎంతో సంప్రదించి పరిష్కరిస్తా

- సాంకేతిక కారణాలతో రైతు రుణమాఫీ సమస్య
- జిల్లాలో 47616 రుణమాఫీ లబ్ధిదారులు
- రూ.237.50 కోట్ల రైతుల ఖాతాలలో జమ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

రైతు రుణమాఫీ జమగాని మెదక్ పట్టణంలోని ఇండియన్ బ్యాంక్‌లో రుణమాఫీ సమస్యపై జనరల్ మేజర్‌తో సంప్రదించి సమస్య పరిష్కారిస్తానని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో రైతు రుణ మాఫీపై జిల్లా వ్యవసాయ, లీడ్ బ్యాంకు మేనేజర్ జిల్లా కోఆపరేటివ్ అధికారులతో కలిసి కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 47,616, మంది రైతులకు లక్ష లోపు రుణమాఫీలో భాగంగా 237.50 కోట్లు రుణం మాఫీ జరిగిందని తెలిపారు. రుణమాఫీ అమౌంట్ జమగాని ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్‌తో సంప్రదించి సమస్యను పరిష్కరించవలసిందిగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో రుణమాఫీలో సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకొని ఈ పథకం పగడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ బృహత్తర కార్యక్రమం అని రైతుల శ్రేయస్సు కోరి రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని, ఈ దిశగా ముందుకు పోవాలన్నారు. తద్వారా వ్యవసాయ రంగ అభివృద్ధి సాధ్యపడుతుందని,

వ్యవసాయ భూమి ఉండి రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఎవరికైనా రుణమాఫీ జరగకపోతే మండల, జిల్లా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. జిల్లాలో మిగిలిన రైతులకు రుణమాఫీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యను పరిష్కరించి త్వరలోనే రుణమాఫీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన విధంగా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ జరుగుతుందని అపోహ చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, జిల్లా కోపరేటివ్ అధికారి కరుణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వికటించి మూడు నెలలు బాలుడు మృతి

- ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన





నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

వ్యాక్సిన్ వికటించడంతో మూడు నెలల బాలుడు ధ్రువ మృతి చెందడంతో బుధవారం పెద్దశంకరపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామానికి చెందిన రాములు మల్లేశ్వరి దంపతులకు మూడు నెలల క్రితం కుమారుడు ధ్రువ జన్మించారు. ప్రస్తుతం తల్లి పెద్ద శంకరంపేట మండల పరిధిలోని బద్దారం గ్రామంలో తల్లిదండ్రుల వద్ద నివసిస్తుంది. బుధవారం ఉదయం మల్కాపూర్ సబ్ సెంటర్లో మూడో నెల వ్యాక్సిన్ (పెంట వాలెట్) ను మూడు నెలల బాలుడికి తల్లి వేయించింది. అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత బాలుడు అస్వస్థతకు గురి కావడంతో గమనించిన తల్లి పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చింది. అప్పటికే బాలుడి పల్స్ పడిపోవడంతో మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలపడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు బంధువులు ఆందోళనకు దిగారు. వ్యాక్సిన్ వికటించడంతోనే బాలుడు మృతి చెందినట్లు వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని తల్లి దండ్రులు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలిసిన వెంటనే అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి పీహెచ్‌సీకి చేరుకొని కుటుంబ సభ్యులను సముదాయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించినట్లు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని కేసు నమోదు చేసుకొని వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ జోన్లపై మెరుపు దాడులు



నవతెలంగాణ-తూప్రాన్: తూప్రాన్ పట్టణంలో నిర్వహిస్తున్న బైక్ జోన్లపై తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానంద్‌ల ఆధ్వర్యంలో బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. పాత బైక్ల అమ్మకాలు చేసే ఫైనాన్స్ జోన్లపై దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. తూప్రాన్ పట్టణంలో 10 బైక్ జోన్ షాపులు నిర్వహిస్తుండగా, సరైన ధ్రువపత్రాలు లేకుండా 400 వరకు బైక్‌లు ఉన్నట్లు సీఐ రంగక్రిష్ణ గుర్తించారు. ధృవపత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, సరైన ధ్రువపత్రాలు లేని బైకులను అమ్ముతున్న పలు బైక్ జోన్లను సీఐ, ఎస్ఐ శివానంద్‌లు సీజ్ చేశారు. ఫైనాన్స్ చెల్లించని బైక్‌లకు ఎన్‌ఓసీ రాకముందే బైక్ జోన్ నిర్వాహకులు అక్రమంగా వినియోగదారులకు అమ్ముతూ, అధిక వడ్డీలను అంటగడుతూ, నిలువు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఒరిజినల్ ఆర్‌సీ కలిగి ఉన్న బైక్‌లను మాత్రమే కొనుగోలు చేయాలని వినియోగదారులకు సీఐ సూచించారు. తూప్రాన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సామాన్యులు తక్కువ ధరలకు బైకులు కొని, అధిక వడ్డీలతో ఫైనాన్స్‌లు చెల్లించి, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఫైనాన్స్‌లు చెల్లించకపోతే బైక్లను సీజ్ చేయడంతో సామాన్యులు నష్టపోతున్నారన్నారు. ప్రయివేట్ ఫైనాన్సులలో బైకులు కొనాలనుకునేవారు ఎన్‌ఓసీ ఉంటేనే బైక్ కొనాలని సూచించారు. ఎక్కడైనా బైక్‌ల ద్వారా ప్రమాదం జరిగితే, బైక్ ఎవరి పేరు పైన రిజిస్ట్రేషన్ అయి ఉంటుందో వారికి జైలు శిక్ష జరిమానా విధించబడునని తెలిపారు. ప్రయివేట్ ఫైనాన్స్‌లలో బైకులు కొంటే పేపర్లు లేకుండా అక్రమంగా అమ్మే బైక్లతో మోసపోతారని, బైకు ఒకరి దగ్గర ఉంటే ఆ బైక్ యొక్క రిజిస్ట్రేషన్ ఇంకొకరి పేరు పైన ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రజలు జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివానంద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో మోసపోయిన యువతి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్‌లో నివాసం ఉంటున్న ఓ యువతికి అనుమానాస్పద ఫోన్ వచ్చింది. యువతకి వచ్చిన ఫోన్ కాల్ ఇంటర్నేషనల్ కొరియర్ వెల్దుర్తి పేరుపైన వచ్చిందని తెలిపారు. స్పందించిన యువతి ఎలాంటి ఆర్డర్ బుక్ చేయలేదని చెప్పింది. దీంతో అనుమానాస్పదంగా ఫోన్ చేసిన వ్యక్తులు సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయడానికి, యువతిని సైబర్ క్రైమ్ బ్యూరోకు కనెక్ట్ అవ్వడానికి 1 నెంబర్ నొక్కాలని ఫోన్ రావడంతో ఆమె 1 నెంబర్ తక్షణమే నొక్కగా ఫోన్ కట్ అయ్యింది. తర్వాత ఆమె ఫోన్లో లోనుకు సంబంధించిన యాప్ డౌన్లోడ్ అయింది. వెంటనే తన ఫోన్‌కు వీడియో కాల్ వచ్చిన తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్ వెరిఫికేషన్ సంబంధించిన బ్యాంకు పూర్తి వివరాలను ఫోన్ కాల్ ద్వారా తెలియజేసిన వాళ్లు చెప్పిన వివరాలతో ఏకీభవించిన యువతి అకౌంట్లోకి రూ.6 లక్షలు జమ అయినట్టుగా సైబర్ నేరస్తులు తెలిపారు. తన అకౌంట్లో రూ.ఆరు లక్షలు జమ అయినట్లుగా చెక్ చేసుకోమని అనుమానాస్పద ఫోన్ చేసిన వ్యక్తి చెప్పడంతో తన బ్యాలెన్స్ చెక్ చేసుకోగా తన అకౌంట్లో రూ.6 లక్షలు జమ అయినట్లుగా కనిపించాయి. తదుపరి క్షణాల్లోనే తన అకౌంట్ నుంచి రూ.4,80 లక్షలు ఇతర అకౌంట్లకు సైబర్ నేరగాళ్లు ట్రాన్ఫర్ చేసేశారు. మోసపోయిన యువతి తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తన అకౌంట్లో ఉన్న రూ.1,20 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు ఎస్ఐ శివానంద్ తెలిపారు. అదే సమయంలో తాను గూగుల్ పే, ఫోన్ పే ఓపెన్ చేయగా వాటిపనితీరు మందగించుకోన్నాయి. ఈ విషయంపై తూప్రాన్ ఎస్ఐ శివానంద కేసు నమోదు చేసుకున్నట్లుగా తెలిపారు.

అవకతవకలకు పాల్పడ్డ ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్: విధుల్లో నిర్లక్ష్యం అవకతవకలకు పాల్పడ్డ ఇద్దరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌కి సంబంధించిన ఓ కేసులో పట్టణ పోలీస్ స్టేషన్‌కి చెందిన కానిస్టేబుళ్లు నీరుడి రాము, యం.రవి అనే ఇద్దరు కానిస్టేబుళ్లు ఓ కేసుకు సంబంధించి ఫిర్యాదుదారుడి వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు రాగా అట్టి ఫిర్యాదును విచారించి నిజమని తేలడంతో వారి ఇద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ.డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా సిబ్బంది ఎవరు కూడా జిల్లాకు పోలీస్ శాఖకు చెడ్డ పేరు తెచ్చేలా చేయకూడదని అలా ఎవరైనా చేస్తే వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

సవతి తల్లి టీజీ-కన్నతల్లి ఏపీ అన్నట్లుగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్



నవతెలంగాణ-తూప్రాన్

కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సహాయంగా కేటాయిస్తూ తెలంగాణకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం కన్నతల్లి ఆంధ్రప్రదేశ్-సవతి తల్లి తెలంగాణ అనడానికి నిదర్శనమని మెదక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజలను ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని భాగ్యరాజ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకపోవడం వల్ల రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను అవమానకరంగా మోసం చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. మోడీ ప్రభుత్వానికి సరైన సమయంలో తెలంగాణ ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టే రోజులు వస్తాయని ఘాటుగా స్పందించారు. ఇప్పటికైనా బీజేపీ 8 ఎంపీలు తన ప్రజలను మోసం చేయకుండా కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడాలన్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఒక్క రూపాయి తీసుకురాని మీకు పదవులు అవసరమా, పనిచేయడానికి చేతగానోళ్ళు మంత్రులుగా కొనసాగే హక్కు, లేదని, కేంద్ర మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సమిష్టి కృషితో గుంతల పూడ్చివేత



నవతెలంగాణ- వెల్దుర్తి

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా నిజము మరిచి నిద్రపోకుమా అనే నిజాన్ని సమిష్టి కృషితో రోడ్డుపై ఏర్పడిన గుంతలను బుధవారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, నాయకుడు ఖాజమైనుద్దీన్, ఇతర నాయకులతో కలిసి కంకర మిషన్ యజమాని సహకారముతో పూడ్చినారు. మండల పరిధి ఆరెగూడెం గ్రామ శివారులో నుంచి ఉప్పులింగపూర్ మీదుగా మెదక్ వెళ్లే రహదారిపై అడుగడుగున అడుగులోతు గుంతలు ఏర్పడి ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయని గుర్తు చేసుకుంటూ, ఉప్పు లింగాపూర్ గ్రామానికి చెందిన నాయకులతో కలిసి కంకర మిషన్ నుంచి డస్ట్ తెప్పించి గుంతలను పూడ్చి వేశామన్నారు. ప్రభుత్వం గతంలోనే శివంపేట మండలం దొంతి నుంచి వెల్దుర్తి మీదుగా మెదక్ వరకు డబల్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు అయినప్పటికీ టెండర్‌లో ఎవరు పాల్గొనక రోడ్డు పనులు అలాగ నిలిచిపోవడం ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం అధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరించడం వాహనాల చోదకులకు వారంలో ఒకటైన యాక్సిడెంట్ అవ్వడం జరుగుతుంటే పులింగాపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ వంచ భాగ్యమ్మ భూపాల్ రెడ్డికి ఆలోచన వచ్చి రోడ్డు మరమ్మతులు చేయించారు. ఈయన వెంట కృష్ణారెడ్డి, హనుమంతరావు, మైసయ్య ఉన్నారు.

క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు

- ప్రజల భద్రత ప్రధాన లక్ష్యం
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

జిల్లాలో క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేసి ప్రజల భద్రత ప్రధాన లక్ష్యమని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్యం అని అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు జిల్లా పరిధిలోని సామ్యాసుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని తెలిపారు. విద్వేషాలను రెచ్చగొట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాము అన్నారు. జిల్లా పోలీసు సిబ్బందితో క్విక్ రియాక్షన్ టీమ్స్ 3 ఏర్పాటు చేసి జిల్లాలో శాంతి, సౌమ్యం, పారదర్శక నిర్వహణకు ఈ క్విక్ రియాక్షన్ టీమ్స్ 3 ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, అదుపునకు నేరాల గుర్తింపు శాంతి భద్రతల సంరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని ఇందుకు అనుగుణంగా జిల్లాలో 3 క్యూఆర్‌టీలు కేటాయించడం జరిగిందని తెలిపారు. క్యూఆర్‌టీ బలగాలను విస్తృతంగా వినియోగించి లాండ్‌ఆర్డర్ నిర్వహించడంలో, ఏదైనా నిరసనలకు వెంటనే స్పందించడంలో, ఈ కీలక సమయంలో పౌరుల భద్రతను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. వేగవంతమైన స్పందన ఏదైనా నిరసన లేదా లాండ్‌ఆర్డర్ పరిస్థితిలో తక్షణ సహాయం అందిస్తారన్నారు. నిరంతర పర్యవేక్షణ , జిల్లా అంతటా శాంతిని కొనసాగించడం, నిరోధకత బలమైన పోలీస్ ఉనికితో ఏదైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించడానికి వినియోగం, ఏదైనా సంఘటన జరిగిన వెంటనే ఈ బలగాలు సత్వరమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని అక్కడ శాంతి వాతావరణం నెలకొల్పారన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహిస్తుంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజలందరూ కలసికట్టుగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం సహకరించాలని కోరారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్
- జక్కపల్లిలో స్థల పరిశీలన



నవతెలంగాణ-నర్సాపూర్

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వ భూమికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామ శివారులో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని జిల్లాల్లో నియోజకవర్గ లో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామం వద్ద ప్రభుత్వ భూమిని పరిశీలించారని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులలో భేదాభిప్రాయం ఉండొద్దని ఉద్దేశంతో ఒకే చోట ఉండి చదువుకోవాలని ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తాహసీల్దార్ కమలాద్రి, ఆర్ ఐ సిద్ధిరామిరెడ్డి, సర్వేయర్ మొగులయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మెన్ అశోక్ గౌడ్

నవతెలంగాణ-నర్సాపూర్

వర్షాకాలం అయినందున నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులపై, వార్డుల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం అయినందున వార్డుల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ, మురికి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. అదేవిధంగా మురికి నీరు వర్షపునీరు తరలింపు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేగాక ఇంటి పన్నుల వసూలు వన మహెూత్సవాల నిర్వహించడంవంటి అంశాల తోపాటు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, వార్డు అధికారులు రాములు, సురేష్ , రాజు, విజయలక్ష్మి , ఆంజనేయులు, పరశురాం రెడ్డి, పాపారావు, రాములు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-కొల్చారం

ఉపాధ్యాయుల బదిలీలో పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుకర్ రావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రజనీకాంత్, మస్తాన్, శిరీష, రాజిరెడ్డి, శంకర్‌లను పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంగయ్య, శ్రీనివాస్, పోచయ్య సునీత, సిద్ధి రాములు, పీఈటీ లక్ష్మణ్ 2016-17 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

గుడికి దారి సమస్య పరిష్కారం

- తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఎస్ఐ మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్: నర్సాపూర్ మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో గత 15 రోజులుగా నెలకొన్న దుర్గమ్మ గుడి భూసమస్య మండల అధికారుల చొరవతో బుధవారం పరిష్కారం అయింది. గ్రామంలోని దుర్గమ్మ గుడికి వెళ్లేందుకు ఉన్న దారి తమ భూమిలోంచి ఉందని కొందరు అడ్డుపడటంతో వివాదం చెలరేగింది. ఇదే విషయమై గత వారం రోజుల క్రితం గ్రామస్తులు మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టగా బుధవారం తమ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లిన తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఎస్ఐ మహిపాల్ రెడ్డి ఇరు వర్గాలతో మాట్లాడి గ్రామస్తులందరి సమక్షంలో దుర్గమ్మ గుడి దారి వివాదాన్ని పరిష్కారం చేశారు. దుర్గమ్మ గుడి దారికి హద్దుల ఏర్పాటు చేయటంతో దుర్గమ్మ దేవాలయ దారి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు

నవతెలంగాణ
4
సిద్దిపేట
గురువారం | 25 జులై 2024 | www.navatelangana.com

చేతులు కడుక్కుని భోజనం చేయాలి

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

విద్యార్థులు పాఠశాలలో మలమూత్ర విసర్జన తర్వాత చేతులు కడుక్కొని భోజనం చేయాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ పాఠశాలలో సఫాయి అప్నా బీమారి భగావో అనే కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ విద్యార్థులతో కలిసి మున్సిపల్ చైర్మెన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్‌లో పరిసరాల పరిశుభ్రత కోసం చెట్లను నాటడం, పిచ్చి మొక్కల తొలగింపు, స్ప్రే చేయించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, వార్డు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపల్ వెంకటయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణాధికారి రవికుమార్, ఉపాధ్యాయులు రవీందర్, నరేందర్, సత్యనారాయణ, వార్డ్ ఆఫీసర్ శారద, ఆర్పీ స్వర్ణలత, జవాన్ సారయ్య, ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వనాలు మానవాళికి వరాలు

నవతెలంగాణ-సిద్దిపేట



వనాలు మానవాళికి వరాలు అని, మానవ మనగడకు మూలమని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు పైన మొక్కలు లేని ఖాళీ ప్రాంతంలో గులాబీ మొక్కలను కమిషనర్ ప్రసన్నరాణి బుధవారం నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట పట్టణం పచ్చదనంతో విలసిల్లుతోందని, ప్రతి ఒక్కరూ కూడా మొక్కలకు నీరు పోసి సంరక్షించాలన్నారు. మొక్కలను మనం నాటి సంరక్షిస్తే అది చెట్టు అయి మనకు నీడను, పండ్లను ఇస్తుందన్నారు. వర్షాలు కురియడంలో మొక్కల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మాధవి, డాక్టర్.స్వామి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలసదనాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట పట్టణంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ సంబంధించిన బాలసదానం, శిశు గృహన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి బుధవారం సందర్శించారు. బాలసదానంలో ఉన్న పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలు ఎలా ఉన్నాయి, పిల్లలకు సంబంధించిన వంటగది, పిల్లల డార్మెంటరీ, టాయిలెట్స్ అన్ని పర్యవేక్షణ చేసి, పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కాగలకుండా చూసుకోవాలన్నారు. పిల్లలకు సంబంధించిన భోజనం సంబంధించిన మెనూ, వాటికి ఎంత ఖర్చు అవుతుంది, పిల్లలకి ఒక్కకరికి ఎంత అమౌంట్ ఎక్కడి నుంచి వస్తుంది అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత శిశుగృహాను విక్షించగా శిశుగృహాలో పిల్లలు ఎంతమంది ఉన్నారు, జిల్లానుంచి ఎంతమంది పిల్లలని దత్తతకు ఇచ్చారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిశు గృహాలో ఉన్న 4 నెలల పాప లాస్యను ఎత్తుకొని సంతోషాన్ని పంచుకున్నారు. ఇక్కడ ఉన్న పిల్లలకి మీరే ఆలనా, పాలనా, రక్షణతొ తల్లిలాగా ప్రేమతో చూసుకోవాలని అక్కడ ఉన్న ఆయలకు, సిబ్బందికి సూచించారు. శిశుగృహ లో పిల్లల టాయిలెట్స్ కు ఇబ్బది ఉంది అని సిబ్బంది చెప్పడంతో తప్పకుండా మీకు తొందరలోనే టాయిలెట్స్ కట్టిస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, రమ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు

నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా భారత్ స్వాభి మాన్ ట్రస్ట్ , వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నట్లు జిల్లా ప్రతినిధులు తోట అశోక్, రాములు, నిమ్మ శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. బుధవారం పట్టణంలో వారు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి గుడి పక్కన ఉన్న శ్రీనివాస ధ్యాన మందిరంలో ఉదయం 5:30 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. బీపీ, షుగర్, స్థూలకాయము, థైరాయిడ్, వివిధ రకాల నొప్పులు, నిద్రలేమి, ఏకాగ్రత లోపం మొదలగు సమస్యలకు శిక్షణ పరిష్కారం చూపుతుందని తెలిపారు. ప్రముఖ యోగ గురువు, జాతీయ గోల్డ్ మెడలిస్టు తోట సంధ్య సతీష్‌ల నేతృతంలో జరిగే ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, అమృత ఆహారం మొదలగు అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

నమ్మి ఓట్లు వేస్తే బడ్జెట్లో ముంచారు

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోనయ్యగారి ఎల్లయ్య

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



ప్రజలు నమ్మి బీజేపీ, కాంగ్రెస్‌లకు 16 ఎంపీ సీట్లకు ఓటు వేసి గెలిపిస్తే బడ్జెట్లో ముంచారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోనయ్య గారి ఎల్లయ్య అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం మీకు కనబడలేదా తెలంగాణ ప్రజలు 16 ఎంపీ సీట్లకు నమ్మి ఓటు వేశారని వారిని మోసం చేశారని స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు. ఎంపీ రఘునందన్ రావు ఎన్నికల ప్రచారంలో రూ.వేల కోట్లు తీసుకువస్తానని చెప్పి ఇప్పుడు పత్తా లేకుండా పోయాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు అని చెప్పి ఆరు నెలలు దాటేశారు. అంతేకాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి లక్ష పేరుకు మాత్రమే చేసి రైతులను గోస పెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామపంచాయతీలు నిధులు మంజూరు చేసి గ్రామ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత గ్రామాలలో ప్రజా అవసరాల కుంటపడ్డాయని అన్నారు. జాతీయ పార్టీలు నాయకులకు కోసం పని చేస్తే బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్, మాజీ సర్పంచులు ఆంజనేయులు, దుర్గం పరశురాములు, నాయకులు పూసల కిషన్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తన బంతులతో పర్యావరణ రక్ష

- ఆత్మ కమిటీ చైర్మెన్,పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్కర్స్ ప్రభాకర్ వర్మ

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



విత్తన బంతులతో పర్యావరణాన్ని రక్షించుకోవచ్చు అని ఆత్మ కమిటీ చైర్మెన్ పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్కాస్ ప్రభాకర్ వర్మ అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురుకుల గ్రామంలో లైఫ్ ఎన్జీవో దేవరగుట్ట బాల ప్రసాద్ తో కలిసి విత్తన బంతులను చల్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా పరీక్ష చేయించిన విత్తనాలను తీసుకొచ్చి దోమకొండ, కామారెడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులతో ప్రతి ఏడాది పది లక్షల విత్తన భంతులు తయారు చేయించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపించి, వాటిని రోడ్ల పక్కన గుట్టల పైన అడవులలో చల్లించారు. ఈ విత్తన బంతులలో ముఖ్యంగా మర్రి, మారేడు, వేప, రావి, జువ్వి, చింత, ఉసిరి, సీమచింత, మామిడి వివిధ రకాలు చెందినవి. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణం కాపాడి వర్షపాతాన్ని చెట్లు దోహదం చేస్తాయి. దానితో పాటుగా పక్షులకు, పశువులకు పండ్లు లభిస్తుంది. చెట్లు సకల జీవరాశికి మనుగడ చెట్లు లేకపోతే ఏ జీవరాశి మనగడం సాగదు. పర్యావరణాన్ని కాపాడడానికి చెట్లను పెంచడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎవరికైనా తమ ప్రాంతానికి విత్తన బంతులు కావాలంటే తమని సంప్రదించాలని వారికి ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మామిళ్ల ఐలయ్య, యాదవు, ప్రశాంత్, మామిండ్ల రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చెయ్యి

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్రంలో అధికార పార్టీతో సమానంగా 8 ఎంపీ సీట్లు ఉండి, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో మొండి చేయి చూపడంలో ఆంతర్యం ఏమిటని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మహేష్ తో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు 18 సార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిశానని, తెలంగాణకు రావలసిన నిధులు తీసుకొస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు మాత్రమే అనుకూలంగా ఉందని తెలిపారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్ల బడ్జెట్ తెలంగాణకు ఒక రూపాయి కూడా ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వానికి సరికాదన్నారు. తెలంగాణకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన అవసరం బీజేపీ ఎంపీలపై ఎంతైనా ఉందన్నారు. తెలంగాణపై బీజేపీకి ఆనాటి నుంచి సవతి తల్లి ప్రేమే ఉంటుందని చెప్పడానికి ఈ బడ్జెట్ నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా బడ్జెట్‌ను సవరించి తెలంగాణ అభివృద్ధికోసం నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దరిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలి

- చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్న ఇంచార్జి కమిషనర్
- సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పట్టణంలో అనేక సమస్యలు విలయ తాండవం చేస్తున్న అవేమి పట్టించుకోకుండా, రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు విమర్శించారు. పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ పట్టణంలోని అనేక వార్డులలో చెత్తా చెదారంతో పాటు మురికి కాలువలలో మురికిని, తీయకపోవడంతో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాల్సిన కమిషనర్ లేకపోవడంతో ఇంచార్జి కమిషనర్ చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని ఆరోపించారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే పరిస్థితి కూడా పట్టణంలో లేదన్నారు. అంగడి బజార్ ప్రాంతంలో చిరు జల్లులకే కుంటలను తలపించేలా ఉందన్నారు. వెంటనే పట్టణంలో ఉన్న సమస్యలను పరిష్కరించకపోతే సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్, పట్టణ కమిటీ సభ్యులు పోలోజు శ్రీహరి, ఇప్పకాయల శోభ, బోయిని, మల్లేశం రాళ్ల బండి భాస్కర్, ఆముదాల నర్సిరెడ్డి, రాళ్లబండి చందు, కాటం రాములు, రంజిత్ రెడ్డి, ఎండి.నూర్భి, భామండ్లపల్లి రమ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై కలెక్టర్ ఆగ్రహం

- ప్రజాపాలన బ్యానర్ లేకపోవడంపై అసహనం
- మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలు కనపడేలా బ్యానర్లు పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఎంపీడీవో రాఘవేందర్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ప్రజాపాలన సేవ కేంద్రం విధులను తనిఖీ చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల కరెక్షన్‌ను ఆన్లైన్ చేస్తున్న విధానంను పరిశీలించారు. ప్రజాపాలన సేవ కేంద్రం అని బ్యానర్ పెట్టకపోతే ప్రజలకు ఎలా తెలుస్తదని అసహనం వ్యక్తం చేసి వెంటనే బ్యానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం దాదాపుగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించి కరెక్షన్‌ల దరఖాస్తులు వస్తున్నాయని స్వీకరించిన తర్వాత వెంటనే కన్స్యూమర్ నెంబర్‌ను, విద్యుత్ యూఎస్‌సీ నెంబర్లను ఆన్లైన్ చేసి దరఖాస్తుదారులకు లబ్ధి చేకూర్చాలని అన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవ కేంద్రాలు ఏర్పాటు చేశారని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు

- ఆరోగ్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలి
- డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-ములుగు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం. జ్వర పీడితులను ముందస్తుగా గుర్తించి, రక్తపూతలు సేకరించి చికిత్స అందించాలి. మన చుట్టూ పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో ప్రజలకు సీజనల్ వ్యాధుల పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో వర్షాలు కురుస్తున్న క్రమంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని, వాతావరణంలో వచ్చే మార్పుల వలన పరిసరాల పరిశుభ్రత లోపించడం, నీరు కలుషితం కావడం , మురికి కాలువలో నీరు ఉండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్లను ఏర్పాటు చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, అంగన్వాడీ కేంద్ర ఆకస్మిక సందర్శనలో భాగంగా తెలిపారు. సందర్శనలో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరు పైన, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపైన ఆరోగ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, కలుషిత నీటిని ప్రజలు త్రాగడం వలన డయేరియా, అతిసారం, అపరిశుభ్రమైన ఆహారం(పులిచిపోయిన)తినడం వల్ల వాంతులు విరోచనాలు, గ్యాస్ట్రోఎంట్రైటిస్ వంటి వ్యాధులు విస్తృతంగా వ్యాపిస్తాయన్నారు. దీనికి తోడు కీటక జనత వ్యాధుల వల్ల ముఖ్యంగా దోమ కుట్టడం ద్వారా విష జ్వరాలు, మలేరియా డెంగ్యూ ,చికెన్ గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి నుంచి రక్త నమూనాలు సేకరించి చికిత్స అందించాలన్నారు. ఫాలోప్ నిర్వహించాలని, అవసరం ఉన్న గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రతి మంగళవారం మరియు శుక్రవారం డ్రైడే పాటించాలని, సిబ్బంది పాఠశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని, హాస్టలను సందర్శించాలని అక్కడ సిబ్బందికి తగు సూచనలు చేయాలని ముఖ్యంగా ఆహార పదార్థాల నిలువల గురించి వంట పాత్రల శుభ్రత గురించి వండిన తర్వాత ఆహారం పైన ఈగలు దోమలు వాల కుండా తీసుకునే జాగ్రత్తల పైన ,పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని, వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు తాగే నీరుని వేడి చేసి చల్లార్చిన నీటిని లేక సురక్షితమైన నీటిని తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలను తినాలని తెలుపుతూ, ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, సంఖ్య పెంచాలని జాతీయా ఆరోగ్య కార్యక్రమాల పనితీరును మెరుగుపరచుకోవాలని తెలిపారు, అనంతరం ఆరోగ్య కేంద్ర పరిసరాలను పర్యవేక్షించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్, వైద్యాధికారి అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలను అందించాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి

నవతెలంగాణ-సిద్దిపేట



రూ.లక్ష లోపు విడుదలైన రైతు రుణమాఫీ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, నెలాఖరులోగా ఆయా రైతులకు కొత్త రుణాలను అందించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్దిపేట బ్రాంచ్, ఎస్బీఐ వ్యవసాయ, వాణిజ్యశాఖ బ్రాంచ్‌లను కలెక్టర్ సందర్శించారు. రైతు రుణమాఫీ, పంట రుణాల రీ షెడ్యూల్ ను పరిశీలించారు. రోజుకు ఎంతమందికి పంట రుణాల రీషెడ్యూల్ చేస్తున్నారు. పంట రుణ మాఫీలో ఎక్కడైనా సమస్య ఉందా, ఉంటే ఎలా పరిష్కరిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నారా అని బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులకు పంట రుణాల రీ షెడ్యూల్ కోసం వచ్చిన రైతులతో మాట్లాడి రుణమాఫీ, పంట రుణాల మంజూరు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థికంగా చేయూతనందించి, వ్యవసాయ రంగంలో మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ కార్యక్రమం తీసుకువచ్చిందని అన్నారు. లక్షా లోపు పంట రుణం ఉండి మాఫీ కానీ రైతుల ఫిర్యాదుల స్వీకరించేందుకు ప్రతి బ్యాంకులో ఏర్పాటు చేసిన ఎంక్వైరీ సెంటర్లో అవసరమైతే అదనంగా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేసి, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని అన్నారు. ప్రతి బ్యాంకులో ప్రతిరోజు 100 రుణాల రెన్యువల్ చేయాలని ఎల్డీఎం హరిబాబును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వికాస్, మేనేజర్ సురేష్, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ జయంత్, మేనేజర్ సుధీర్ ఆయా బ్యాంకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపంతో అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు

- వర్షపు నీరు నిల్వ ఉండడంతో డెంగ్యూ విస్తరించే అవకాశం ఉంది
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డీఎల్‌పీఓ మల్లికార్జున్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్బర్ పేట-భూంపల్లి మండలం కాజీపూర్ గ్రామంలో అధికారులతో కలిసి డీఎల్ పీఓ మల్లికార్జున్ రెడ్డి బుధవారం పర్యటించారు. డెంగ్యూ కేసులు వరుసగా నమోదు కావడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో పర్యటించి విస్తృతంగా పర్యటించి ప్రజలకు డీఎల్‌పీఓ మల్లికార్జున్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల డెంగ్యూ వ్యాధి విస్తరించ ప్రమాదం ఉందన్నారు. ఇటీవల గ్రామంలో డెంగ్యూ కేసులు వరుసగా నమోదైన విషయాన్ని 'నవ తెలంగాణ'లో వచ్చిన కథనాన్ని తెలుసుకొని డెంగ్యూ వ్యాధిపై ఆరా తీశారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించేలా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం కావడంతో ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండడం ద్వారా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ముమ్మరంగా శానిటైజేషన్ చేయడంతో పాటు పారిశుధ్య పనులను చేపట్టారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరేశం, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

నవతెలంగాణ-సిద్దిపేట



సంక్షేమ హాస్టల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం బుధవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ఏడాది ప్రారంభమై రెండు నెలలు అవుతున్న విద్యార్థులకు రావలసి కాస్మోటిక్ చార్జీలు, పుస్తకాలు, బుక్స్ పూర్తిస్థాయిలో రాలేదన్నారు. విద్యార్థులకు సరిపడా బెడ్షీట్స్, దోమల తెరలు, కిటికీలకు జాలీలు లేక దోమలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎంబీబీఎస్ డాక్టర్లను హాస్టల్స్‌కు అపాయింట్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలలో పురుగులు వస్తున్నాయనీ, హాస్టల్‌ల పర్యవేక్షణ లోపించిందని, అలాగే రెంటెడ్‌గా నడుస్తున్న హాస్టల్స్‌కు సొంత భవనం లేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఈ వర్షాకాలంలో విద్యార్థులకు గొడుగులు అందించాలని డిమాండ్ చేశారు. పుస్తకాలు జిల్లా కేంద్రానికి వచ్చిన విద్యార్థులకు అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కొండా సంజీవ్ కుమార్, జిల్లా నాయకులు మధిర, గుండె అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

- పోలీస్ స్టేషన్ సందర్శనలో సీపీ అనురాధ
- రికార్డులను తనిఖీ చేసిన సీపీ
- గంజాయి, బెల్ట్ దుకాణాలపై చర్యలు చేపట్టాలని హెచ్చరిక



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రజలకు సేవలందించడలో పారదర్శకంగా వ్యవహరిస్తూ నిజాయితీగా విధులు నిర్వర్తించాలని సీపీ డాక్టర్ అనురాధ పోలీసులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీపీ అనురాధ అకస్మికంగా సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ యందు సిబ్బంది విధులను తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సీపీ సూచించారు. మండలంలో గంజాయి, మత్తు పదార్థాలు, బెల్ట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలను నివారించేల చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీసులకు సీపీ తెలిపారు. పోలీస్ స్టేషన్ యందు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రతి ఫిర్యాదుదారుడికి తిరిగి రిసీప్ట్ అందించాలని సిబ్బందికి సూచించారు. అక్రమ ఇసుక రవాణపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ ముందు మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఆర్బీ సీఐ కమలాకర్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ శంకర్ రావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎల్లయ్య, కనకయ్య, అంజయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి , సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను బుధవారం హుస్నాబాద్ పట్టణంలో 19 వ వార్డ్ కౌన్సిలర్ బొజ్జ హరీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వార్డులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ స్టేట్ జనరల్ సెక్రటరీ పరశురామ్, హుస్నాబాద్ టౌన్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి, అక్కన్నపేట్ మండల యూత్ అధ్యక్షులు సంపత్, యూత్, సోషల్ మీడియా, విద్యార్థి విభాగ నాయకులు సంజీవ్, ప్రభాకర్, సాగర్, మహేష్ అనిరుధ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం

నవతెలంగాణ-సంగునూరు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటి చైర్మెన్ కోల రమేశ్ గౌడ్ అన్నారు. బుధవారం నంగునూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేంద్ర అర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టం ప్రకారం నిధులను కేటాయించారని పేర్కొన్నారు. విభజన బిల్లు చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నిధులను సమకూర్చాలని బిల్లులో పొందుపరచాని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి సైతం నిధులను సమకూర్చాలని డిమాండ్ చేశారు. జాతీయ పార్టీలు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెప్పారన్నారు. కానీ ఇందుకు భిన్నంగా కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులను సమకూర్చి అందులో రాష్ట్రానికి గుండు సున్నా నిధులను కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీ ఎంపీలు 8 మంది, కాంగ్రెస్ ఎంపీలు 8 మందిని గెలిపించినప్పటికీ నోరు తెరవకపోవడం గమనార్హంగా ఉందన్నారు. బీజేపీ నుంచి కేంద్రంలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణకు బడ్జెట్లో చోటు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. గతంలో మాదిరిగానే ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణను చిన్న చూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమాకుల సొసైటీ చైర్మెన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్‌లు రాగుల సారయ్య, వేముల వెంకట్ రెడ్డి, నాయకులు బద్దిపడగ కిష్టారెడ్డి, కోల మహేందర్ గౌడ్ గౌడ్, ఉల్లి మల్లయ్య, రంగు రాజు గౌడ్, ఎం.డి. అజీజ్, బెదురు తిరుపతి, పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

పార్లమెంట్‌లో కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని, పదేండ్ల క్రితం విభజన అయిన కొత్త రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేయాల్సిన కేంద్రం పట్టించుకోలేదని ఎంపీటీసిల ఫోరం మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ లక్కాకుల నరేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య ముదిరాజులు విమర్శించారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకే బీజేపీ కేంద్ర మంత్రులు కాలం గడిపారన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, అరుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా ఎందుకూ పనికిరాకుండా పోయారన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రం ప్రస్తావన లేకపోవడం బీజేపీకి చిత్తశుద్ధిలేదన్నారు. మధ్యతరగతి, వేతన జీవులకు సైతం పెద్దగా భారం చేకూర్చే విధంగా లేదన్నారు. బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు ఉన్నా రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకరావడంలో విఫల మయ్యారన్నారు. విభజన చట్టం ప్రకారం ఏపీకి భారీగా విధులు ఇచ్చి తెలంగాణను ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణకు ప్రధాని మోదీ మొండి చేయి చూపడం ఆంధ్రప్రదేశ్ కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన కేద్రం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలోని వెనుకబడిన తొమ్మిది జిల్లాలకు ఎలాంటి కేటాయింపులు చేయక పోవడం భాదకరమన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఇ. బాలరాజు సస్పెండ్

-ఉత్తర్వులు జారీ చేసిన పోలీసు ఉన్నతాధికారులు

నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇ.బాలరాజ్, హెడ్ కానిస్టేబుల్ పోలీస్ డిపార్ట్మెంట్ సీసీఏ రూల్స్ అతిక్రమించి క్రమశిక్షణ రహితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు రాగా విచారణ జరిపి బుధవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన పోలీస్ ఉన్నతాధికారులు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కమిషనర్ డా. బి. అనురాధ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. క్రమశిక్షణ రహితంగా విధులు నిర్వహించే అధికారులను సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలి



- కమిషనర్‌కు వినతి

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాదులో రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ షేక్ యాస్మిన్ భాషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా పట్టురైతుల సంఘం అధ్యక్షులు పెద్దోళ్ల ఐలయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పట్టు గూళ్లకు ఇతర రాష్ట్రాల్లోని మార్కెట్లలో కంటే ధర కిలోకు రూ.100 నుంచి రూ.200 తక్కువ రావడంతో ఇక్కడ రైతుల నష్టపోతున్నారని అన్నారు. సరైన ధర రైతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్లో పట్టుగూళు అమ్మిన రోజే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. డబ్బులు లేటుగా రైతులకు అందడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఇన్సెంటివ్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు అందేలా చూడాలని కోరారు. పట్టుపురుగులకు వినియోగించే మందులను, పరికరాలను సబ్సిడీపై రైతులకు అందించాలని కోరారు . కార్యక్రమంలో పట్టు రైతుల సహకార సంఘం నాయకులు పెద్దోళ్ల నర్సింలు, పి.యాదగిరి, బి. నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

- అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు ఎస్ఐ పరశురాం



నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామం వద్ద డీసీఎం వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా, అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి నుంచి దౌల్తాబాద్ మండలం వడ్డేపల్లి గ్రామానికి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించారు. సుమారు 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలుస్తుంది. సివిల్ సప్లై అధికారుల నివేదిక ఆధారంగా కేసు నమోదు చేశారని పోలీసులు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా బియ్యం తరిలిస్తే చట్టపరమైన చర్యలు తప్పు అని అన్నారు.

రక్షిత మంచినీటి పథకం చుట్టూ శుభ్రత చేసిన మున్సిపల్ సిబ్బంది



నవ తెలంగాణ -గజ్వేల్

హౌసింగ్ బోర్డ్ కాలనీ సమస్యల గురించి టి. లక్ష్మీనరసింహారెడ్డి హౌసింగ్ బోర్డ్ సమస్యలను వివరిస్తూ వాటర్ ట్యాంక్ దగ్గర విపరీతమైన చెత్త చెదారం, పిచ్చి చెట్లు, ఉండడంవల్ల పాములు ఇండ్లలోకి వస్తున్నాయని దాన్ని శుభ్రంచేయమని కోరామని కాలనీ వాసులు తెలిపారు. దానికి మున్సిపల్ కమిషనర్ స్పందించి మున్సిపల్ సిబ్బందిని పంపించి క్లీన్ చేయించినట్లు వారు తెలిపారు. వార్డ్ కౌన్సిలర్ ఎన్సీ రాజమౌళి, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య హౌసింగ్ బోర్డ్ తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి.లక్ష్మీనరసింహారెడ్డి దేవసాని వాసుదేవ్ పాల్గొన్నారు.

విధుల్లో చేసిన సేవలు గుర్తింపునిస్థాయి



నవతెలంగాణ-నంగునూరు

ఉపాధ్యాయులు విధుల్లో చేసిన సేవలు గుర్తింపునిస్థాయని మాజీ సర్పంచ్ ఐలేని సత్తవ్వ అన్నారు. బుధవారం నంగునూరు మండలం ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లి నటువంటి ముగ్గురు ఉపాధ్యాయులకి, బదిలీపై వచ్చినటువంటి ఉపాధ్యాయులకు, అదేవిధంగా బాసర ట్రిపుల్ ఐటీలో సీటు తెచ్చుకున్నటువంటి నలుగురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలేని సతీశ్, ఎస్ఎంసీ చైర్మెన్ గూడెం నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జేఎస్ఆర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జేఎస్ఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎస్ఆర్ అభిమానులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత ఐదేండ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేదవారికి ఏ కష్టం వచ్చిన తాను ఉన్నానంటు ముందుండేవాడన్నారు. ప్రతి ఏడాది కొత్తకొండ జాతరలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఇంటికి మొక్కలు అందజేశారన్నారు ప్రజల మన్ననలు పొందుతున్నా జేఎస్ఆర్ నిండు నూరేళ్ళు, సుఖసంతోషాలతో విలాసిల్లాలని భగవంతుని వేడుకున్నారు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు, తోట సమ్మయ్య, రాం ప్రసాద్, దేవేందర్ రెడ్డి, సంపత్ నాయక్, రవి, అనంతర స్వామి, అరుణ్, రాజేందర్, మారోజు నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గుండు సున్నా



నవతెలంగాణ-సిద్దిపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడంపై ప్రజల నుంచి రాజకీయ పార్టీల నుంచి తీవ్రంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గుండు సున్నా. తెలంగాణ గెట్స్ జీరో ఇన్ యూనియన్ బడ్జెట్. అంటూ సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్‌లో వెల్సిన ఫ్లెక్సీని చూసి ప్రజలు చర్చించుకుంటున్నారు.

అక్కన్నపేట ఎస్ఐగా విజయ్ భాస్కర్ బాధ్యతలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలానికి నూతన ఎస్ఐగా విజయ్ భాస్కర్ నియమితులయ్యారు. బుధవారం ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ తాండ్ర వివేక్ జమ్మికుంటకు బదిలీ అవ్వడంతో, విజయ్ భాస్కర్ ఇక్కడికి వచ్చి చార్జ్ తీసుకున్నారు.

మరణానికి కారణమైన నేరస్తుడికి జరిమాన

నవతెలంగాణ-వర్గల్

2018 ఏడాదిలో నేరస్తుడు మహేందర్ కుమార్ ఉత్తరప్రదేశ్ కి చెందిన వ్యక్తి తన లారీని అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఒక వ్యక్తి మరణానికి కారణం అయినందున గౌరారం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. కేసు పరిశోధనలో భాగంగా నేరస్తుని అరెస్టు చేసి జ్యుడిషియల్ డిమాండ్‌కు పంపించారు. కేసు పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినారు. కేసు నమోదు చేసిన రోజు జులై 24 వరకు గజ్వేల్ అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టులో కేసు విచారణ కొనసాగింది. ఇరువురి వాదనలు విన్న గజ్వేల్ అడిషనల్ జేఎఫ్‌సీఎం ప్రియాంక నేరస్తునిపై నేరం రుజువైనందున రూ.10 వేల జరిమానా విధించారని గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

అనారోగ్యంతో సొసైటీ స్వీపర్ మృతి

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని రేబర్తి సొసైటీ క్యాష్ కౌంటర్లు స్వీపర్గా పనిచేస్తున్న సీహెచ్ ఎల్లవ్వ (46) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఎల్లవ్వ రేబర్తి సొసైటీలోని క్యాష్ కౌంటర్ స్వీపర్‌గా మూడేళ్ళుగా విధులు నిర్వర్తిస్తుంది. అనారోగ్యంతో మృతి చెందడంతో సొసైటీ చైర్మెన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, ఆదేశాల మేరకు సీఈఓ బోయిని శ్రీధర్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, భర్త ఉన్నారు.

బీజేపీకి తెలంగాణ ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టాలి


- కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

బడ్జెట్‌లో తెలంగాణకు సవతి తల్లి ప్రేమ చూపిన బీజేపీని తెలంగాణ ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టే సమయం వచ్చిందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి సర్దార్ ఖాన్, డీసీసీబీ మాజీ డెరక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు డప్పు గణేష్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రాన్ని విస్మరించడం చూస్తుంటే తెలంగాణ పై మోడీ ఆలోచన విధానం ఏ మాత్రం మారలేదన్నారు. తెలంగాణపై అక్కసు కక్కుతునే ఉన్నాడు. దీనికి పూర్తిగా బాధ్యత వహిస్తూ తక్షణమే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో సహా బీజేపీ ఎంపీలు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్టు అన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలు దేశ ప్రజలే కాకుండా మోదీ ప్రభుత్వాన్ని కూడా నచ్చింది అందుకే కాంగ్రెస్ మేనిఫెస్టో లోని కొన్ని భాగాలను కాపీ కొట్టి పూర్తిగా కాపీ కొట్టలేక విఫలమైనట్లు విమర్శించారు. ప్రధానమంత్రి కుర్చిని కాపాడుకోవడానికి ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు ఈ బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇచ్చి ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఈ బడ్జెట్లో విస్మరించడం దేశ ప్రజలు గమనిస్తున్నట్టు అన్నారు. కేంద్ర బడ్జెట్ కేవలం ధనికులకు వరంగా ఉన్నది పేదల బతుకులు ఆగం చేసిన బడ్జెట్ ఇది. ఫోన్ రీఛార్జీలు పెంచి సెల్ ఫోన్ ధరలను తగ్గించడం సిగ్గుచేటు అన్నారు. పేదలు ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల ధరలు పెంచడం బంగారం, వెండి ధరలను తగ్గించడం చూస్తుంటే మోడీ ప్రభుత్వం ఎవరికీ న్యాయం చేస్తుందో చాలా స్పష్టంగా అర్థం అర్థమవుతుందన్నారు. మోడీ ప్రభుత్వం ఏనాడు కూడా పేద ప్రజలకు న్యాయం చేసిన సందర్భం లేదన్నారు.

మృతిని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి బొడ్డు బాలమల్లు (62) ఇటీవల మృతిచెందాడు. బుధవారం తిర్మలన్న యువసేన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పద్మ నర్సింలు, మగ్గి కిషన్, రాజయ్య, లక్ష్మణ్, తదితరులున్నారు

బాధితులకు సఖి భరోసాగా ఉండాలి

- సఖి భరోసా కేంద్రం సందర్శించిన కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

సఖి భరోసా కేంద్రాలు బాధితులకు అండగా నిలవాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సఖి భరోసా కేంద్రాలను సందర్శించారు. నిధులు, సిబ్బంది వివరాలు వాటి నిధులు తెలుసుకున్నారు. బాధిత మహిళలకు అండగా ఉండేలా విధులు నిర్వహించాలని అన్నారు. ఏదైనా గృహహింసకు గురైన వారు సఖి కేంద్రాన్ని సంప్రదించిన వెంటనే స్పందించి వారి వద్దకు వెళ్లి వారిని సఖి కేంద్రానికి తీసుకువచ్చి అవసరమైన సహకారాలు అందించాలని అన్నారు. బాధితులకు, బాధ్యులను పిలిపించి విడివిడిగా, సంయుక్తంగా కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని అవసరమైన వారికి లీగల్ సహకారం కూడా అందించాలని అన్నారు. బాధితులు ఐదు రోజులపాటు కేంద్రంలో ఉండడానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని అన్నారు. కుటుంబ గొడవలు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు తదితర మహిళా సంబంధ సమస్యలు వీటి పైన సఖి కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సఖి కేంద్రం ప్రతిమను ఆదేశించారు. వీరి వెంట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి ఉన్నారు.

డ్రైవర్ చేతిలో ప్రయాణికుల భద్రత

- హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

ప్రయాణికులను తమ గమ్యస్థానానికి చేరవేసే వరకు ప్రయాణికుల భద్రత డ్రైవర్ చేతిలో ఉంటుందని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ప్రజల్లో ఆర్టీసీ డ్రైవర్లకు మంచి స్థానం ఉందని అతి జాగ్రత్తతో బస్సు నడపాలని సూచించారు. హుస్నాబాద్ డిపో మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిపో నుంచి బయలుదేరే ముందు బస్సు యొక్క కండిషన్, బ్రేక్స్, వైఫర్‌లను చెక్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ లు డ్రైవర్స్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మధ్యతరగతి ప్రజలను నిండా ముంచిన బడ్జెట్







నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్ర ప్రభుత్వం నిన్న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.48 లక్షల 20 కోట్లలతో రైతులకు మధ్యతరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, మండిపడ్డారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క రూపాయి కేటాయించకపోవడంతో తెలంగాణ రాష్ట్రంపై ఎంత చిన్నచూపు ఉందో తెలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన, గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గించకపోవడం పేద మధ్యతరగతి ప్రజలను వంచించడమేనని అన్నారు. జాతీయ క్రైమ్ రిపోర్ట్ నివేదిక ప్రకారం దేశంలో గత పదేండ్లలో దాదాపు లక్ష మంది రైతులు, కౌలు రైతులు చనిపోయిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలన్నారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ఆధారంగా 18 రకాల పంటలకు లక్ష కోట్ల సంఘటిత నిధులు కేటాయించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగాన్ని చేర్చాలని కూడా రైతులు డిమాండ్ చేసిన పార్లమెంట్లో చర్చించలేదన్నారు. రాష్ట్రాలకు సమన్యాయంతో బడ్జెట్ కేటాయించినప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయయని, మోడీకి బీహార్, ఆంధ్రప్రదేశ్ మాత్రమే కనిపిస్తున్నాయని మిగతా రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, జిల్లా సీనియర్ నాయకులు సుధాకర్, జిల్లా మాజీ అధ్యక్షులు దేగల వెంకటేష్, వెలుపుల రాజు, హుస్నాబాద్ మండల అధ్యక్షులు దుంద్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో భాగంగా బీజేపీ ప్రభుత్వం ఎన్డీయే కూటమిలో ఉన్న రాష్ట్రాలకు ఇష్టా రాజ్యంగా బడ్జెట్ విడుదల చేయడం చాలా దుర్మార్గం అని సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ తెలిపారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివలింగు కృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన తెలంగాణ రాష్ట్రంకు కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి చూపించడం, తెలంగాణ నుంచి బీజేపీ పార్టీకి ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులను గెలిపించినప్పటికి రాష్ట్రానికి నిధులు కేటాయించక పోవడానికి కేంద్ర మంత్రులయినా కిషన్ రెడ్డి, బండి సంజయ్ భాద్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీల్లో భాగంగా ములుగు యూనివర్సిటీ నిధులు, కాజీపేట రైల్వే నిర్మాణం, బయ్యారం ఉక్కు కర్మాగారాని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో మొండిచేయి చూపించడం బీజేపీ ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్ట అని అన్నారు. ఈ విధంగా నరేంద్ర మోడీ తన పదవి కాపాడుకోవడానికి సహాయపడిన ఆంధ్రప్రదేశ్ బీహార్ లాంటి రాష్ట్రాలకు మాత్రమే అధిక సంఖ్యలో నిధులు కేటాయించారని, దీనికి బాధ్యత వహిస్తూ తెలంగాణ నుంచి ఎంపికైన ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు సర్గం రాజేశం, చింత శ్రీను, పల్లెపహాడ్ గ్రామ సీపీఐ నాయకులు పోచయ్య, రాజం, బిక్షపతి పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎంపీలు పార్లమెంటులో కనీసం గళం విప్పకపోవడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి ఇలా అన్యాయం చేయడం సమంజసం కాదని ప్రశ్నించారు. ప్రతిక్షణం ఎన్డీఏ కూటమిని కాపాడే పార్టీలకే పెద్ద పీటవేయడం, మిగతా రాష్ట్రాలకు అన్యాయం చేయడం బీజేపీకి అలవాటైపోయిందని తెలియజేశారు. ఇప్పటికైనా తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో గళం విప్పకపోతే రాష్ట్ర ప్రజలకు తీవ్రంగా అన్యాయం చేశారని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు ఎక్కడికక్కడ ఎంపీలని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ లింగాల సాయన్న, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సూరంపల్లి పరశు రాం, మండల నాయకులు హరీష్, చిట్యాల సంపత్, తదితరులు, పాల్గొన్నారు.

మోసం చేసిన బడా బాయ్, చోట బాయ్

- ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి
- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

బీజేపీ బడే బాయ్ మోడీ, కాంగ్రెస్ చోటే బాయ్ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు తీవ్ర మోసం చేశారని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ఒంటేరు ప్రతాపరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో నిధులు ఇవ్వాలని తరచుగా పీఎం నరేంద్ర మోడీని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రులు కలిసి మాట్లాడితే ఒక నయా పైసా ఇవ్వలేదని విమర్శించారు. సీఎం కుర్చి పదిలం కోసం మోడీని రేవంత్ రెడ్డి కలిసినట్లు విమర్శించారు. తెలంగాణ బడ్జెట్ కోసం కాదని తేలిపోయిందన్నారు. ఐదేండ్లు సీఎం సీటు భద్రంగా ఉంచే విధంగా చూడాలని మోడీని పలుసార్లు కలిసి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసినట్లు ఉందని ఆరోపించారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ 8 మంది పార్లమెంట్ సభ్యులు గెలిచి బడ్జెట్లో సాధించింది ఏముందని పార్లమెంటు స్థానాలకు కాంగ్రెస్ సభ్యులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీజేపీ నుంచి గెలిచిన 8 మంది ఎంపీల్లో ఇద్దరు కేంద్ర మంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ మంత్రి పదవులు ఇస్తే చాలు అని మోడీకి చెప్పినట్లుందన్నారు. వెంటనే కేంద్ర మంత్రి పదవులకు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు నయా పైసా బడ్జెట్లో తీసుకురాని మెదక్ ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పటాన్చెరుకు మెట్రో చేస్తా, రైలు తెస్తా గొప్పలు చెప్పిన రఘునందన్ రావు ఇప్పుడు ఏమి మాట్లాడుతాడని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాదాసు శ్రీనివాస్, మల్లేశం, మద్దూరు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, నర్సింగారావు, జాఫర్ ఖాన్, లక్ష్మీ కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట వ్యక్తి పురస్కార గ్రహీత రంగాచారికి జర్నలిస్టుల సన్మానం

- విశిష్ట వ్యక్తి పురస్కారం అందుకున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షులు
- రంగాచారికి అర్బన్ ప్రెస్ కమిటీ సన్మానం



నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్

తెలంగాణ శ్రీ వైష్ణవ సంఘం పలు రంగాలలో కృషి చేసిన వారికి అందించే "విశిష్ట వ్యక్తి" పురస్కారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షులు, సిద్దిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలకుంట్ల రంగాచారికి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేట అర్బన్ మండల ప్రెస్ క్లబ్ కమిటీ తరపున రంగాచారికి బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రంగాచారి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పత్రికా, మీడియా రంగంలో పనిచేస్తున్న తనకు తోటి జర్నలిస్టులు, వీడియో కెమెరా జర్నలిస్టులు ఎంతగానో సహకరించారన్నారు. వారందరి సహకారం వల్లే ఈరోజు శ్రీవైష్ణవ సేవా సంఘం పురస్కారం తనకు దక్కిందన్నారు. తనకు పురస్కారం అందించినందుకు శ్రీ వైష్ణవ సేవా సంఘం వారికి, అన్ని వేళలా సహాయ సహకారాలు అందించిన తోటి జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సంజీవరెడ్డి, రంగదాంపల్లి శ్రీనివాస్, అర్బన్ ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు సతీష్, ఉపాధ్యక్షులు స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ కోశాధికారి సంతోష్, సహాయ కార్యదర్శి జైపాల్ రెడ్డి గౌరవ సలహాదారు రమేష్, ఆఫీస్ ఇంచార్జి బి, శ్రీనివాస్, కమిటీ సభ్యులు నరేష్, కెమ్మసారం శ్రీనివాస్, శ్రీకాంత్, మహేష్, అంకుష్,చందు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ సంత సంగాపూర్ రోడ్డుకు మార్పు





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రజలకు ఇబ్బందులు జరుగుతున్నందున ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న బుధవారం సంతను సంగపూర్ రోడ్‌లో గల ఐసీడీఎస్ గోదాం రోడ్డుకు మారుస్తున్నట్లు మార్కెట్ సెక్రెటరీ జాన్ వెస్లీ అన్నారు. బుధవారం మార్కెట్ రోడ్డు మున్సిపల్ కమిషనర్ నరసయ్య, సీఐలు సైదా, ట్రాఫిక్ సీఐ మురళిలు, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రోజు రోజుకి ట్రాఫిక్‌తో రోడ్డు ప్రమాదాలు అవుతున్నాయన్నారు. కాబట్టి ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసయ్య, గజ్వేల్ సీఐ సైదా, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి ఆధ్వర్యంలో బుధవారం రోజున అంగడి ఒక కారణంగా పరిగణలోకి తీసుకున్నమన్నారు. ఇందిరా పార్క్ చౌరస్తా నుంచి మార్కెట్ వల్ల ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రమాదాలు జరగకుండా అరికట్టాలంటే ఈ రోడ్డు నుంచి సంతను మారిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇకనుంచి బుధవారం సంతను సంగాపూర్ రోడ్‌లో ఉన్న ఐసీడీఎస్ గోదాం పక్కన నిర్వహిస్తారన్నారు. దీంతో ఇంద్ర పార్క్ ఆవరణలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలు

- ముఖ్య అతిధిగా హాజరైన సీఐ బి.సైదా





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల ప్రారంభోత్సవంను ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, బస్సులను బస్ స్టాప్స్‌లో రోడ్డుకి ఎడమపక్కకు ఆపుతూ ప్రమాదాలను అరికట్టవచ్చని గజ్వేల్ సీఐ బి.సైదా అన్నారు. ప్రారంభోత్సవం సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల పై డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ డ్యూటీ అయిపోయిన తర్వాత తగు విశ్రాంతి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటరన్నారు. అందువల్ల ప్రమాదాలు జరుగకుండా అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం జీపీపీ డీయం పావన్ మాట్లాడుతూ డ్రైవర్లు ఏకాగ్రతతో నడుపుతున్నారని ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డ్రైవర్లను కొనియాడారు. ఏకాగ్రతతో, మరింత బాధ్యతతో బస్సులు నడపాలని డ్రైవర్లకు సూచించారు. డిపోలో ఈ ఏడాది, మైంటైనన్స్ స్టాఫ్ పూర్తి సహకారంతో జీరో యాక్సిడెంట్స్ ఇయర్‌గా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ బాబు నాయక్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ జమీల్, డ్రైవర్లు, డిపో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కోనాయపల్లిలో విషాదం



నవతెలంగాణ-నంగునూరు

అప్పుల బాధతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం కొనాయపల్లిలో జరిగింది. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. ఇందుకు సంబంధించి రాజగోపాలపేట ఎస్ఐ ఎం.డి.ఆసిఫ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లమారి బాబు (49) తన తల్లిదండ్రులు ఒకే ఏడాదిలో చనిపోవడంతో సుమారు రెండు లక్షల అప్పు అయింది. అలాగే ఇంటి మరమ్మతుల కోసం ఐఐఎఫ్ఎల్ ప్రయివేట్ బ్యాంకులో రూ.5 లక్షల హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. అప్పు తీర్చే మార్గం కనపడకపోవడంతో ఈ నెల 22న ముంద్రాయి గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతన్ని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు బాబు పెద్ద కొడుకు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజగోపాలపేట ఎస్ఐ మొహమ్మద్ ఆసిఫ్ తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో పచ్చదనం పరిశుభ్రత నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయ ఆవరణాల్లో, పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలని.. వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మండల కేంద్రమైన కల్హేర్‌లోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, నిజాంపేట మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ మినీ గురుకులాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయంగా పాఠశాలలో పచ్చదనం-పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్య క్యాంపులు నిర్వహించి వ్యాధుల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా నీళ్ల, ఆహార కల్తీ వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని సంక్షేమ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి పారిశుధ్యం ఆహార తనిఖీలు చేపట్టాలన్నారు. దోమలు నివారణ చర్యలు పాటించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి పాఠశాలల్లో అవెన్యూ డ్రైవ్ చేపట్టాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. నూటికి నూరు శాతం మొక్కలు నాటి పచ్చదనం విస్తరించే విధంగా ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయ పాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. రాత్రి వేళల్లో డాక్టర్లు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు మాత్రమే రోగులను పంపాలని, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను పంపించొద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, తహసీల్దార్లు నాగజ్యోతి, వెంకటేశ్వర్లు, ఎంపీ డీఓ శ్రీనివాసులు, ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ అనిల్‌రెడ్డి, గురుకుల ఉపాధ్యాయులు నిర్మల, పుష్పలత, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి



నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించడం బాధాకరమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపైన ఉన్నదని.. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారన్నారు. 17 మంది ఎంపీలు ఉన్న రాష్ట్రంలో 8 మంది బీజేపీ వారే అయినప్పటికీ.. రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. విద్యారంగానికి జీడీపీలో 6శాతంపై కేటాయించాలని పలు కమిటీలు సిఫార్సులు చేసినా.. బడ్జెట్‌లో సుమారు 3శాతం మాత్రమే కేటాయించడం దుర్మార్గమన్నారు.ఇక్కడ సరైన సదుపాయాలు లేనందున ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర దేశా లకు పోవాల్సి వస్తున్నదన్నారు. ఒక్కొక్క విద్యార్థి విదేశీ యూనివర్సిటీలకు సుమారు రూ.50 లక్షల వరకు చెల్లించాల్సి వస్తున్నదన్నారు. చదువుకునే వారిలో భారత్ మొదటి స్థానంలో ఉండగా సదుపాయాల కల్పనలో మాత్రం 32వ స్థానంలో ఉన్నదన్నారు. కాబట్టి విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.

గజ్వేల్ పట్టణంలో 'గొడుగు' రాజకీయం





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో వారం రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలకు సైతం రాజకీయ నాయకులు గొడుగు రాజకీయం ప్రారంభించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి నియోజకవర్గంలో కేసీఆర్ చిత్రపటం ఉన్న గొడుగులను పంపిణీ చేశారు. సుమారు నియోజకవర్గంలో 50 వేలకు పైగా గొడుగులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో కేసీఆర్ బొమ్మ ఉన్న గొడుగులను ఇప్పుడు వర్షానికి మహిళలు, పురుషులు బయటకు తీశారు. కేసీఆర్ బొమ్మ ఉన్న గొడుగులను పట్టుకొని తిరుగుతుండడంతో మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు తానేం తక్కువ అని ఆయన బొమ్మ ఉన్న గొడుగులను గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. వర్షంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బొమ్మతో ఉన్న గొడుగులను సైతం ప్రజలు పట్టుకొని సంచరిస్తున్నారు. వర్షాకాలంలో సైతం గొడుగు రాజకీయం నియోజకవర్గంలో కనిపించడంతో ప్రధాన చర్చ జరుగుతుంది.

నవతెలంగాణ

6

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 25 జూలై 2024 | www.navatelangana.com

రెండు గంటల పాటు నిలిచిన వాహనాలు



నవతెలంగాణ-నంగునూరు

మెదక్ నుంచి ఎల్కతుర్తి జాతీయ రహదారిపై నంగునూరు మండలం ముండ్రాయి శివారు ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణం పనుల కోసం పైపులు వేయటం కోసం రెండు గంటల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం పనులు చేపట్టడం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాన నీరు వెళ్ళేందుకు పైపులు వేయటం కోసం రెండు గంటల పాటు పనులు చేపట్టడం వల్ల అన్ని రకాల వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ప్రయాణికులు వాహనాల నుంచి దిగి గొడవలు చేశారు.రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయాయి.

రజక సంఘం ఆధ్వర్యంలో బోనాలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ,ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. డప్పువప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపు చేపట్టి ఆలయాల వద్ద బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.రజక కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీఓ గా సత్యనారాయణ



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల ప్రజా పరిషత్ ఎంపీఓ గా ఇ.సత్యనారాయణ భాధ్యతలు చేపట్టారు.హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల పంచాయతీ అధికారి గా విధులను నిర్వహిస్తున్న ఇ. సత్యనారయణ హుస్నాబాద్ నుండి బదిలీ అయి నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి గా బాధ్యతలు చేపట్టాడు.కార్యలయ సిబ్బంది స్వాగతం పలికారు.

పేదరికాన్ని అంతం చేసే బడ్జెట్ కావాలి

బీఎస్పీ నేత టప్ప భానుచందర్



నవతెలంగాణ-చేగుంట

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో సమర్పించిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, పేదరికాన్ని అంతం చేసే బడ్జెట్ కావాలని బహుజన్ సమాజ్ పార్టీ చేగుంట మండల అధ్యక్షుడు టప్ప భానుచందర్ ఆరోపించారు. చేగుంటలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని పేదలు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, శ్రామికులు, నిరుపేదలు, నిర్లక్ష్యానికి గురైన బహుజనులను సమస్యాత్మక జీవితాల నుంచి విముక్తి చేసేందుకు మంచి రోజులు వస్తాయని ఎవరూ ఆశించడం లేదు. నూటికి 85 శాతం ఉన్న బహుజనుల జీవితాలను ఏ బడ్జెట్ మార్చలేక పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో విపరీతమైన పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వెనుకబాటుతనం నెలకొని ఉన్నాయి. 125 కోట్లకు పైగా బలహీనవర్గాల అభ్యున్నతి, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఈ కొత్త ప్రభుత్వంలో అవసరమైన సంస్కరణవాద విధానం, ఉద్దేశం లేదు. బడ్జెట్లో ఇలాంటి కేటాయింపులతో ప్రజల జీవితాలు సంతోషంగా, సుభిక్షంగా ఎలా మారుతాయని ప్రశ్నించారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ప్రజల బాగోగులు మారడం లేదని ఎద్దేవా చేశారు.

ప్రజ్ఞాపూర్ వైకుంఠధామాన్ని పరిశీలించిన కమిషనర్

అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని కోరిన మూడో వార్డు కౌన్సిలర్.



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ మూడవ వార్డు వైకుంఠధామాన్ని గోల్కొండ నరసయ్య పరిశీలించారు. బుధవారం వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య తో కలిసి వైకుంఠధామానికి వెళ్లారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కమిషనర్‌తో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వైకుంఠధామాన్ని పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకు రాలేదన్నారు. చుట్టూ కాంపౌండ్ వాల్, సిసి బెడ్ సదుపాయాలను కల్పించాలని కోరారు.ఎంతో అభివృద్ధి సాధించిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ప్రజ్ఞాపూర్ వైకుంఠ గ్రామానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ స్వయానా వైకుంఠధామానికి వచ్చి అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను స్వయంగా వీక్షించారు. ప్రస్తుతం బడ్జెట్ లేనందున త్వరలోనే మరమత్తు పనులకు పై అధికారులతో మాట్లాడి బడ్జెట్ వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లగా అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామాన్ని వాడుకలోకి తీసుకువచ్చేందుకు నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీధర్ రెడ్డి, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో అల్లిబిల్లి బాల నర్సయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. పేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ చౌడు చెర్ల మమత జయపాల్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని పంపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బడె రాజయ్య, సనాధుల బాలపోచయ్య దాసరి రమేష్, మృతుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

అప్పుల బాధ తాళలేక మండలంలోని లింగాపూర్‌కు చెందిన చెపూరి ఆంజనేయులు గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం లింగాపూర్‌లో ఆయన మృతదేహానికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బీమా ద్వారా రూ.5 లక్షల సహాయం అందుతుందన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో వారి కుటుం బానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు తగరం అశోక్, బీఆర్ఎస్ నాయకులు బిక్కనూరి శ్రీశైలం, సంతోష్, జీడిపల్లి స్వామి, సుతారి రాములు, బండారు స్వామి గౌడ్, రాంబాబు తదితరులు ఉన్నారు.

మండల బీజేపీ కార్యవర్గ సమావేశం



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలోనీ వంజరి సంఘంలో అధ్యక్షులు చంద్రశేఖర ఆధ్వర్యంలో మండలం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందా రెడ్డి , మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, ఆర్మూర్ ప్రభారి హాజరయ్యారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ సంస్థగతంగా అభివృద్ధి గురించి దిశానిర్దేశం చేశారన్నారు. అలాగే రైతు రుణాలను ఎలాంటి కొరివిలు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నస్కల్ రోడ్డు పనులు పూర్తి చేయాలని లేనిచో ధర్నాకు కూర్చుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో రాబోయే సంస్థగత ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేష్ మహంకాళి, మండల కార్యవర్గం సీనియర్ నాయకులు పప్పుల సిద్దరాంరెడ్డి , ఆముద రాజు, పంజా బాబు, నక్క స్వామి, అక్కల నవీన్, స్వామి గౌడ్, జాల పోచయ్య తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జనగామ పిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నల్ల నాగుల శ్వేత వెంకటాచారి, వైస్ చైర్మన్‌గా కామిడి జీవన్ రెడ్డి, డైరెక్టర్లుగా ఇర్రి రాంరెడ్డి, ఆసర్ల అంజయ్య, అర్జుల పోషి రెడ్డి, వంగ కృష్ణా రెడ్డి, బైతి శ్రీనివాస్, ధరావత్ లక్ష్మి, సింగపాక కుమార్,చల్లా అండాలు, బండారి కనకయ్య, బైరగోని భాను ప్రకాష్, పాల లక్ష్మీనారాయణ, తడక లింగమూర్తి లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ నూతన పాలకవర్గం వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని, రైతులకు అన్ని విధాలా అండగా ఉండాలని, కొనుగోళ్లు సరిగ్గా జరిగేలా చూడాలని కోరారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కి పట్టం కట్టిన ఏడు నెలల వ్యవధిలోనే రాహుల్ గాంధీ నేతృత్వంలో సోనియా గాంధీ ఆదేశాల మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ జరుగుతుందని, కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చినా కూడా రేవంత్ రెడ్డి ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తూ అందరికీ అండగా ఉంటామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మశాలిల సంక్షేమానికి కృషి చేస్తా





తాజా మాజీ అధ్యక్షులు దుర్గాప్రసాద్
మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి

నవ తెలంగాణ- గజ్వేల్

పద్మశాలిల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తాజా మాజీ సంఘం అధ్యక్షులు టి.దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పద్మశాలి సంఘం అధ్యక్ష పదవికి మరోసారి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడేళ్లల్లో పద్మశాలిలకు ఆర్థికంగా సామాజికంగా అండగా ఉంటానని అన్నారు. మరోసారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పద్మశాలిలకు ఆపద సంపదలో ముందుంటా అన్నారు. పద్మశాలి ఉపాధ్యక్షులుగా తుమ్మ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గాడిపల్లి విజయ్ కుమార్, కోశాధికారిగా సూరంలింగం, సంయుక్త కార్యదర్శిగా దేవసాని వాసుదేవులు నామినేషన్ వేశారు. నామినేషన్ సందర్భంగా హాజరైన కుల బంధువులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ కుల బంధువులను ఉద్దేశించి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాబోయే మూడేళ్ల కాల పరిమితిలో నన్ను అధ్యక్షునిగా గెలిపిస్తే పద్మశాలి సమాజానికి ఎప్పటికి అందుబాటులో ఉంటూ పద్మశాలి ఫంక్షన్ హాల్ బ్యాలెన్స్ వర్క్‌లో కిచెన్, డైనింగ్ రూమ్, కాంపౌండ్ వాల్, నిర్మాణ పనులు పూర్తి చేస్తానని తెలిపారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలో ఉన్న వేలాది ఓటర్లను ప్రతి ఇంటింటికి ప్రతి ఓటర్ను కలిసి ఓటు అభ్యర్థిస్తానని తెలియజేశారు. గత రెండేళ్ల కాలంలో పలు రకాల సేవా కార్యక్రమాలు అసంపూర్తిగా ఉన్న ఫంక్షనల్ బిల్డింగ్ పూర్తి చేసి ఓన్లీ కిచెన్ డైనింగ్ హాల్ కాంపౌండ్ హాల్ పెండింగ్ ఉచారని వివరించారు. దయచేసి కుల బంధువులందరూ మీ అమూల్యమైన ఓటు మాయొక్క ప్యానెల్‌కు వేసి అఖండ మెజార్టీతో గెలిపించగలరని సభ ముఖంగా విజ్ఞప్తి చేశారు. ప్యానల్ సేవాభావంతో ముందుకొస్తున్నామని దయచేసి కుల బంధువులందరూ ఆశీర్వదించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో పలువురు పద్మశాలి కుల సంఘ నాయకులు పెద్దలు పద్మశాలి యూత్ విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల తస్మాత్ జాగ్రత్త





నవతెలంగాణ- గజ్వేల్ రూరల్

ప్రస్తుత వర్షాకాలంలో అనేక విష జ్వరాలు, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వార్డు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్ అన్నారు. బుధవారం వార్డులో మురికి గుంతలు ఇంటి పరిసరాలలో శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా అర్చన శివకుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమ, ఈగలు తినుబండారాలపై రావాలని ఏర్పరచుకుంటాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వార్డులో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, లాంటి విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచివడ బోసిన నీటిని తాగి ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-వర్గల్

వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణీ హరిత అన్నారు. బుధవారం మండలంలోని గిర్మాపూర్ గ్రామంలో వైద్య సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని, నీటిని కాచి వడగట్టి తాగితే మంచిదన్నారు. పిల్లలు, వృద్దుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీటి నిల్వలను వెంటనే తొలగించాలి

మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో రోడ్లపై ఎక్కడ నీటి నిలువ ఉన్న వెంటనే సిబ్బంది తొలగించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు బుధవారం మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో ఆయన పర్యటించారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై(డెంగ్యూ, మలేరియా) ఇంటికి అవగాహన కల్పించామన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇంటి ఆవరణలో రోడ్లపై నేటి నిల్వలు ఉండకుండా మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా ఆర్పీలు డ్రై డే-ఫ్రైడే ప్రతి శుక్రవారం వార్డులో నిర్వహించేలా చూడాలన్నారు. నీటి నిలువ లెకుండా అని వార్డులలో డ్రై డే ప్రోగ్రాం చేయాలని మెప్మా సీఓ సరిత ను ఆదేశించారు. పట్టణంలోని వర్షాల వలన రోడ్లపై నీటి నిల్వలు ఉన్న వార్డులను పరిశీలించడంతో పాటు వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని ఏఈ శ్రీధర్ రెడ్డి తో చర్చించారు.వెంటనే డ్రైనేజీ సమస్య ఉన్న చోట పైపుల ద్వారా నీటి నిలువ లేకుండా చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మోడీ కుర్చీ కాపాడే వారికి బడ్జెట్లో స్థానం

- ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణకు నిధులు సున్నా
- మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోడీ తన కుర్చీ కాపాడుతున్న ఏపీకి ఇతర రాష్ట్రాలకు నిధుల వరద కురిపించినట్లు మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశ ప్రజల కోసం మోడీ లేరని కేవలం తన కుర్చీ కోసమే పాకులాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలను కేంద్ర బడ్జెట్లో మోసం చేసినట్టు ఆవేదన చెందారు. తెలంగాణ ప్రజలు మరోసారి నట్టేట ముంచిన రెండు జాతీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి అవమానం తీసుకువచ్చిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు తెలంగాణ ప్రజలు గ్రామాలకు వస్తే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్‌కి రైల్వే ప్రాజెక్ట్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. జాతీయ పార్టీలను తెలంగాణలో సమాధి చేయాలని తెలిపారు. తెలంగాణ ప్రజలకు మేలు చేయను పార్టీలు తెలంగాణలో అవసరం లేదని చెప్పారు. గత బడ్జెట్లో నయా పైసా ఏపీకి పోలేదని ఇప్పుడు మోడీ కుర్చీని కాపాడుతున్న చంద్రబాబు నాయుడుకి ఏకంగా రూ.15 వేల కోట్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 పార్లమెంటు స్థానాలు ఇచ్చిన తప్పు చేశారని అన్నారు. కాంగ్రెస్ ఎనిమిది మంది ఎంపీలు పార్లమెంటులో ఏం చేసినట్లని ఆయన ప్రశ్నించారు. రెండు పార్టీలకు తెలంగాణ ప్రజలు చావు దెబ్బ త్వరలోనే కొడతారని ఆయన అన్నారు.

గ్రామ అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు కీలకం



నవ తెలంగాణ- రాయపోల్

గ్రామ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉంటుందని ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేస్తే గ్రామం అభివృద్ధి చెందుతుందని దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామస్తులు అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బదిలీ కాగా నూతనంగా బదిలీపై వచ్చిన ఇద్దరి పంచాయతీ కార్యదర్శులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి పాత్ర కీలకంగా ఉంటుందని గ్రామ అభివృద్ధికి, గ్రామ సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు కీలకంగా పనిచేస్తారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా చెట్ల నర్సంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా రవీందర్ సేవలు అందించారు. గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కారంలో గ్రామ అభివృద్ధిలో చురుకుగా పనిచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగుల బదిలీలలో భాగంగా రవీందర్ తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామానికి బదిలీ కావడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలు గ్రామంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్నందుకు ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలకడం జరిగిందన్నారు. అనంతరం చెట్ల నర్సంపల్లి నూతన గ్రామ పంచాయితీ కార్యదర్శిగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన గోపీని కూడా సన్మానం చేసి స్వాగతం పలకడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దుబాషి భాస్కర్, ధూభాషి గోపీ, పసుల గోపీ, వేమ మల్లేశం, వేమ రామచంద్రం,పసి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

చదువు విద్యార్థికి మంచి మార్గాన్ని చూపుతుంది

- పేదరికం చదువుకు అడ్డు కాదు
- ఎడ్యుకేషన్ మెమోరియల్ ట్రస్టు ద్వారా మాధవరెడ్డి బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-మిరు దొడ్డి

పేదరికం చదువుకు అడ్డు కాదని, చదువు విద్యార్థికి మంచి మార్గాన్ని చూపుతుందని ఎడ్యుకేషన్ మెమోరియల్ ట్రస్ట్ నాయకులు మాధవ రెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులకు చేయాలని సూచించారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని అన్నారు. అనంతరం పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయుడు నరేష్ కు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ సర్పంచ్ కిష్టయ్య, ఉపసర్పంచ్ దిలీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆగస్టు లోపు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంగిశెట్టి రవీందర్



నవతెలంగాణ-గజ్వేల్

ఆగస్టు లోపు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు గంగిశెట్టి రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంకు వచ్చి 8 నెలలు గడుస్తున్న కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమైన ఏ గ్యారెంటీ పూర్తిస్థాయిలో కాలేదని ఆయన విమర్శించారు. రైతు రుణమాఫీతో పాటు రూ 4 వేలు, మహిళలకు రూ2500 రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా 200 యూనిట్లు అందరికీ పూర్తిస్థాయిలో ఇంకా అమలు కావడంలేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన డేటా ఎంట్రీ తిరిగి ఓపెన్ చేయలేదని దీని ద్వారా పార్లమెంట్ ఎన్నికల ముందు దరఖాస్తు చేసుకున్న వారికి గ్యాస్, 200 విద్యుత్తు యూనిట్ల పథకం అమలు కాలేదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజాపాలన కౌంటర్ డేటా ఎంట్రీ తిరిగి ప్రారంభించాలని ఆయన కోరారు. అదేవిధంగా కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్‌తో పాటు తులం బంగారం ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని ఆయన చెప్పారు. ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని ఆగస్టులోపు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

సిఐలు బి. సైదా,ట్రాఫిక్ సిఐ మురళి.



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

రోడ్డు నిబంధనలు చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీఐ బి. సైదా, ట్రాఫిక్ సిఐ మురళీలు అన్నారు. బుధవారం గజ్వేల్ తెలంగాణ మోడల్ స్కూల్ గర్ల్స్ హబ్‌లో సైబర్ నేరాల కట్టడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్,గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధన గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు.కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదన్నారు. ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని,సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలిని సూచించారు.అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని,గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దన్నారు.తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలన్నారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 ఫోన్ చేయాలన్నారు. సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ ,9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ గోపి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిశీలించుకోవాలి

ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి



నవ తెలంగాణ-మిరుదొడ్డి

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, రవి శేఖర్ అన్నారు. బుధవారం అక్బర్పేట బొంపల్లి మండలం బొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పిరమిడ్ కార్యక్రమంలో నిర్వహించారు. బొంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ స్పోర్ట్స్ డే ను విద్యార్థిని విద్యార్థులు పిరమిడ్స్ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు, వ్యాయామం, క్రీడరంగం లో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో దయాసాగర్ రెడ్డి. స్వామి. రాజశ్రీ. భాగ్యవతి. సంతోషి. మేఘమాల. పి ఈ టి వెంకటరెడ్డి విద్యార్థులు లచ్చపేట పాల్గొన్నారు